


# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 240 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 22 మే 2026 | పేజీలు : 12 | వెల : 2/-



## 2026 స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు

- మొత్తం 20 తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్ బ్యూరో సమావేశంలో తీర్మానం
- మహానాడును పండుగలా జరపాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు పిలుపు
- ఇంధన పొదుపులో భాగంగా వర్చువల్‌గా జరిగిన పొలిట్ బ్యూరో సమావేశం
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించాలని ఆదేశం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు ఈసారి 'స్త్రీ శక్తి' థీమ్‌తో జరగనుంది. ఈ మేరకు పార్టీ పొలిట్ బ్యూరో కీలక నిర్ణయం తీసుకుంది. మే 27, 28 తేదీల్లో హైబ్రిడ్ విధానంలో జరగనున్న మహానాడులో మొత్తం 20 తీర్మానాలను ప్రవేశపెట్టాలని తీర్మానించింది. గురువారం నాడు ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అధ్యక్షతన పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం వర్చువల్ పద్ధతిలో జరిగింది. ఇంధన పొదుపు చర్యలలో భాగంగా జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి చంద్రబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పాల్గొనగా, మిగిలిన పొలిట్ బ్యూరో సభ్యులు వివిధ ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో మహానాడు నిర్వహణ, అజెండాపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మహానాడులో ప్రవేశపెట్టాల్సిన తీర్మానాలపై చంద్రబాబు కీలక సూచనలు చేశారు. మొత్తం 20 తీర్మానాలకు పొలిట్ బ్యూరో ఆమోదం తెలిపింది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 10, తెలంగాణకు 4, అండమాన్‌కు 1 తీర్మానం ఉన్నాయి. వీటితో పాటు నాలుగు ఉమ్మడి తీర్మానాలు, చివరగా ఒక కీలక రాజకీయ తీర్మానాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఈ ఏడాది మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని నిర్ణయించినందున, కార్యక్రమం మొత్తం ఆ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళా సాధికారతకు, వారి హక్కులకు టీడీపీ కట్టుబడి ఉందని, ఆ విషయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలోనూ మహిళలనే భాగస్వాములను మిగతా .. 2లో..

### వేంకటేశ్వరుని
## కిరీటం ఎక్కడ?
### తాకట్టు వ్యవహారంపై విచారణ



**గుడివాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా గుడివాడలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి ఓ భక్తుడు సమర్పించిన వజ్రసహిత సువర్ణ కిరీటం మాయంపై దేవాదాయశాఖ విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై దేవాదాయశాఖ అధికారులు స్పందించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ లలిత ఆలయానికి చేరుకుని అర్చకుడి నుంచి మిగతా .. 2లో..

### 'మావిగన్'ను
## ప్రతిపాదించింది అందుకే..

- స్కాముల కోసమే చంద్రబాబు అమరావతి అంటున్నారు
- కేసీఆర్ రూ. 615 కోట్లతో అత్యాధునిక సచివాలయాన్ని కట్టారని ప్రశంస
- 'మావిగన్'కు రాష్ట్ర ప్రజలు మద్దతు పలికారని మాజీ సీఎం జగన్ వ్యాఖ్య



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న పెద్ద దురదృష్టమని వైసీపీ అధినేత జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల భవిష్యత్తులో కూడా ఏపీకి రాజధాని లేకుండా పోయే ప్రమాదం ఉందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాము ప్రతిపాదించిన 'మావిగన్' పేరు ఎత్తితేనే చంద్రబాబుకు గుండె ఆగిపోయేలా ఉందని, భయంతో మంత్రులతో బూతులు మాట్లాడిస్తున్నారని జగన్ విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా... సున్నా నుంచి ప్రారంభించాల్సిన మిగతా .. 2లో..

## 'రెడ్ జోన్'లోకి చమురు మార్కెట్లు..

### ఐఈఏ చీఫ్ హెచ్చరిక



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ వ్యాప్తంగా ఇంధన నిల్వలు తరిగిపోవడం, వేసవి సీజన్‌లో ప్రయాణాల డిమాండ్ వల్ల చమురు మార్కెట్లు త్వరలోనే 'రెడ్ జోన్'లోకి ప్రవేశించే అవకాశం మిగతా .. 2లో..

### ఎబోలా కలవరం వేళ..
### ఇండియా- ఆఫ్రికా ఫోరమ్
## సమిట్ వాయిదా




**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆఫ్రికాలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి దేశాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ పరిణామాల నడుమ దిల్లీ వేదికగా ఈ నెల 28-31 తేదీల మధ్య జరగాల్సిన 'ఇండియా- ఆఫ్రికా ఫోరమ్ సమిట్' వాయిదా పడింది. భారత్, ఆఫ్రికన్ యూనియన్ కలిసి ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. కొత్త మిగతా .. 2లో..



తిరుమలలో భక్తజన సంద్రం..

## శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటలు

**బుధవారం 7 గంటల పాటు సర్వదర్శనం క్యూలైన్ తాత్కాలికంగా నిలిపివేత**

**స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ముగుస్తుండటంతో పెరిగిన రద్దీ**

**నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు**

**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. విద్యాసంస్థలకు వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకోవడం, పరీక్షల ఫలితాలు వెలువడటంతో మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో తిరుమల గిరులు భక్తజన సంద్రంగా మారాయి. రద్దీ అనూహ్యంగా పెరగడంతో శ్రీవారి సర్వదర్శనానికి ఏకంగా 30 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. నిన్న మధ్యాహ్నం భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరగడంతో, టీటీడీ అధికారులు మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8 గంటల వరకు సర్వదర్శనం క్యూలైన్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. తిరిగి రాత్రి 8 గంటలకు మిగతా .. 2లో..

## జగన్‌కు 'భాస్కర్ అవార్డు' గ్యారంటీ

- తల్లిని, చెల్లిని తరిమేసి బాబాయిని లేపేసిన వ్యక్తి జగన్
- రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్మోహన్ రెడ్డి అని తీవ్ర విమర్శ
- 2029లోపు కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామని హామీ
- కూటమి మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ ఫేక్ ఖాతాలతో కుట్ర
- గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉంటూ సంక్షేమ, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి నారా లోకేష్ పిలుపు




**రాయలసీమ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇవాళ జగన్ ప్రెస్ మీట్ చూశాక ఆయనకు 'చీటింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' ఇవ్వొచ్చనిపించిందని, ఆయన అద్భుత నటనకు 'భాస్కర్ అవార్డు' గ్యారంటీ అని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. కడప అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, జగన్‌పై, వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సొంత కుటుంబాన్నే కాకుండా, సొంత జిల్లాను, నియోజకవర్గాన్ని కూడా జగన్ మోసం చేశారని ఆరోపించారు.

**జగన్‌కు ఛీటింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఇవ్వొచ్చు**

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తల్లిని, చెల్లిని తరిమేశారని, బాబాయిని లేపేసి మరో చెల్లి కుటుంబానికి అన్యాయం మిగతా .. 2లో..

## నిప్పుల కొలిమి

- పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత
- పలు జిల్లాల్లో 47 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా నమోదు
- వచ్చే సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని హెచ్చరిక



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో వేసవి తన ప్రతాపాన్ని తీవ్రస్థాయిలో చూపిస్తోంది. రాష్ట్రం అగ్నిగుండాన్ని తలపిస్తుండగా, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పిడుగురాళ్లలో మిగతా .. 2లో..

### పాక్ నరమేధ చర్యలను
## ఎండగట్టిన భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వీటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సాయుధ ఘర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ మిగతా .. 2లో..

### ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై
## ఏపీలో కేసు నమోదు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌పై కేసు నమోదైంది. ఓ టెలివిజన్ ఛానల్ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ జనసేన కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా మిగతా .. 2లో..

## జగన్‌పై మంత్రి నాదెండ్ల ఫైర్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ చేసిన విమర్శలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీపం పథకం, మధ్యాహ్న భోజనం నాణ్యత, ప్రత్యేక విమానాల వినియోగం వంటి అంశాలపై జగన్ పూర్తిగా అసత్యాలు,

## బక్రీద్ సెలవు ఈనెల 28న

### ఉత్తర్వులు జారీ చేసిన సిఎస్ సాయి ప్రసాద్

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** బక్రీద్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28వ తేది గురువారం సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ జిఓఆర్టీ సంఖ్య:1006 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. బక్రీద్ పర్వదిన్నాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం గతంలో ఈనెల 27వ తేది బుధవారం సెలవు దినంగా ప్రకటించడం జరిగింది. అయితే నెలవంక ఆధారంగా ముస్లిం సమాజం బక్రీద్ వేడుకను ఈనెల 27కు బదులుగా 28 గురువారం నిర్వహించుకోనున్నారని విజయవాడ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్య నిర్వహణాధికారి మిగతా .. 2లో..

### తెలంగాణలో
## కార్మికులకు శుభవార్త

### తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభవార్త చెప్పారు. కార్మికుల కనీస వేతనాల పెంపుపై కేబినెట్ సబ్ కమిటీ నివేదిక మేరకు తీసుకున్న నిర్ణయాలను సీఎం మీడియాకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. "బీఆర్ఎస్ హయాంలో కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించకపోవడం వల్ల 1.11 కోట్ల మంది నష్టపోయారు. కనీస వేతన పెంపుపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి కీలక సిఫార్సులు చేసింది. అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ కేటగిరీలుగా విభజించింది. కార్మికుల వేతనాలు నిర్ణయించేందుకు జోన్లను మూడు జోన్లుగా విభజించాం. జోన్-1 మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్-2 మున్సిపాల్టీలు, జోన్ -3 కింద గ్రామీణ ప్రాంతాలు ఉంటాయి. జోన్ -1లో అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు, సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.13,592 నుంచి రూ. 17 వేలకు, స్కిల్డ్ కార్మికుల వేతనాన్ని రూ.13,772 నుంచి రూ.18,500కి, హై స్కిల్డ్ కార్మికులకు రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మిగతా .. 2లో..

### దర్శకుడు మెహర్ రమేష్‌కు కీలక పదవి ఇచ్చిన
## ఏపీ ప్రభుత్వం

### డైరెక్టర్ల బోర్డులో సుమన్, శివాజీ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలక మండలిని నియమించింది. సంస్థ ఛైర్మన్‌గా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ పంపిణీదారుడు పి. భరత్ భూషణ్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, వైస్ ఛైర్మన్‌గా ప్రముఖ సినీ దర్శకుడు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు

చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వీటితో పాటు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల వంటి అంశాలపై మహానాడులో కూలంకషంగా చర్చ జరగాలని ఆదేశించారు. 'మన దేశం-మన బాధ్యత' పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న పొదుపు చర్యలపైనా ప్రత్యేకంగా చర్చించాలని సూచించారు. రాష్ట్రంలో 'ప్రత్యర్థి పార్టీ' పేరిట జరుగుతున్న అరాచకాలను, కుట్రలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, వారిలో అవగాహన పెంచేలా మహానాడు కార్యక్రమాలు ఉండాలని పొలిట్ బ్యూరో అభిప్రాయపడింది. ఎన్టీఆర్ సిద్ధాంతాలు, తెలుగుదేశం పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేసేలా ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇవ్వాలని కూడా నిర్ణయించారు. హైబ్రిడ్ పద్ధతిలో ఈసారి మహానాడు జరుగుతున్నప్పటికీ, దాని స్ఫూర్తి మాత్రం తగ్గకూడదని చంద్రబాబు స్పష్టం చేశారు. మహానాడును ఒక పండుగలా నిర్వహించాలని, రెండు రోజుల ముందు నుంచే ప్రతి ఇంటిపైనా టీడీపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అగ్ర నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. అన్ని క్లస్టర్లలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి మహానాడును ప్రారంభించాలని పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయించారు.

## 'రెడ్ జోన్'లోకి చమురు మార్కెట్లు..

ఉందని 'అంతర్జాతీయ ఇంధన సంస్థ' (ఐఈఏ) చీఫ్ ఫాతిహ్ బిరోల్ హెచ్చరించారు. ఇరాన్ యుద్ధం వల్ల తలెత్తిన ఈ ఇంధన సంక్షోభానికి.. హర్మూజ్ జలసంధిని పూర్తిగా, బేషరతుగా తిరిగి తెరవడమే పరిష్కార మార్గమని చెప్పారు. "హర్మూజ్‌ను తిరిగి తెరవడంలో విఫలమైతే.. పశ్చిమాసియా నుంచి సరఫరాలు లేక ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలు తగ్గిపోతాయి. సంక్షోభం ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా మిగులు నిల్వలు ఉన్నప్పటికీ.. ప్రస్తుతం అవి క్షీణిస్తున్నాయి. దీనికి తోడు వేసవి సీజన్‌లో ప్రయాణాల డిమాండ్ పెరగడం వంటి కారణాలతో జులై లేదా ఆగస్టులో చమురు మార్కెట్లు 'రెడ్ జోన్'లోకి ప్రవేశించవచ్చు" అని ప్రపంచ ఇంధన భద్రతపై లండన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో బిరోల్ వ్యాఖ్యానించారు. ఇంధన సంక్షోభం వల్ల ఆసియా, ఆఫ్రికా దేశాలపై అధిక ప్రభావం పడుతుందని చెప్పారు. పశ్చిమాసియాలో చమురు ఉత్పత్తి, శుద్ధి కేంద్రాల నిర్వహణ.. యుద్ధానికి ముందు స్థాయికి తిరిగి రావడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉందన్నారు. అవసరమైతే.. మరిన్ని వ్యూహాత్మక చమురు నిల్వల విడుదలను సమన్వయం చేయడానికి ఐఈఏ సిద్ధంగా ఉందని తెలిపారు.

## ప్రతిపాదించింది అందుకే..

అమరావతి కంటే, ఇప్పటికే అన్ని సదుపాయాలు ఉన్న 'మావిగన్' ప్రాంతాన్ని ప్రత్యామ్నాయంగా చూపించామని జగన్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ ప్రతిపాదనకు మద్దతు పలికారని, ఆ వాస్తవాన్ని తట్టుకోలేకనే చంద్రబాబు తనపై, వైసీపీపై బురద జల్లుతున్నారని వైఎస్ జగన్ విమర్శించారు. అమరావతిలో కేవలం రోడ్లు, నీరు, డ్రైనేజీ వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలకే రూ.2 లక్షల కోట్లు ఖర్చవుతుందని.. రాజధాని నిర్మాణం ఆచరణ సాధ్యం కాదని తెలిసినా చంద్రబాబు కేవలం స్కామ్‌ల కోసమే ముందుకు వెళుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే అమరావతి పేరుతో రూ. 47,387 కోట్లు అప్పు చేశారని, ఖజానా నుంచి మరో రూ.9,200 కోట్లు ఖర్చు చేస్తూ రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో ఇప్పటికే రూ.1,200 కోట్లతో నిర్మించిన అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ తాత్కాలిక భవనాలు ఉన్నప్పటికీ, మళ్లీ కొత్తగా కడతామనడం విచ్చలవిడి దోపిడీకి నిదర్శనమ న్నారు. కొత్తగా నిర్మించ తలపెట్టిన 5 బిల్డింగ్‌ల అంచ నాలను జగన్ ప్రశ్నించారు. ఈ ఐదు బిల్డింగుల డిజైన్లకే రూ. 401 కోట్లు తగలేశారని, మొత్తం నిర్మాణ ఖర్చు రూ. 10,665 కోట్లుగా చూపించారని లెక్కలు కట్టారు. "ప్రస్తుత అంచనాల ప్రకారం చదరపు అడుగుకు నిర్మాణ వ్యయం రూ. 20,427 అవుతోంది. దీనికి ఫర్నీచర్, ఇంటీరియర్ ఖర్చులు కూడా కలిపితే చదరపు అడుగుకు రూ. 30 వేలు దాటుతుంది. ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మాణానికే చదరపు అడుగుకు రూ. 4,500 లోపు ఖర్చవుతుంటే, ఇక్కడ ఇంత భారీ ఖర్చు దేనికి?" అని జగన్ నిలదీశారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో కేసీఆర్ కేవలం రూ. 615 కోట్లతోనే అత్యంత ఆధునిక సచివాలయాన్ని నిర్మించారని, కానీ ఏపీలో మాత్రం కొత్త టెండర్ల పేరుతో పాత కాంట్రాక్టర్లకే పనులు ఇస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు.

## వేంకటేశ్వరుని కిరీటం ఎక్కడ?

వివరాలు సేకరించారు. దేవస్థానం ట్రస్ట్ కార్యాలయం తాళాలు, రికార్డులు అడిగారు. ట్రస్ట్‌లోని 31 మంది సభ్యులు అందుబాటులో లేమని ఫోన్‌లో సమాధానం ఇవ్వడంతో ఏసీ విస్మయం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇచ్చినా అందుబాటులో లేకపోవడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాత కుటుంబ సభ్యులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. ఇవాళ మధ్యాహ్నంలోపు విచారణ నివేదిక అందించాల్సి ఉండటంతో .. అసిస్టెంట్ కమిషనర్ లలిత దేవస్థానంలోనే వేచి ఉన్నారు. ఆలయ కమిటీ.. దేవాదాయ శాఖ పరిధిలో లేకపోవడంతో ట్రస్టు బోర్డుపై చర్యలు తీసుకోలేకపోతున్నామని ఏసీ తెలిపారు. ఈ వ్యవహారం ముదరడంతో బంగారం తాకట్టు వ్యాపారి పరారీలో ఉన్నాడు. తన ఖాతాలోకి తాకట్టు డబ్బులు పంపితేనే.. ఊర్లోకి వస్తానంటూ మధ్యవర్తుల ద్వారా ట్రస్టుబోర్డుకి సమాచారం అందించారు.

**కిరీటం మాయం.. వెలుగులోకి ఇలా..**

గుడివాడలోని ఆర్యవైశ్య కల్యాణ మండపానికి చెందిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి 2025 జనవరిలో మాటూరి సుబ్బారావు రూ.70లక్షల విలువైన వజ్రాలు పొదిగిన 461 గ్రాముల బంగారు కిరీటాన్ని బహూకరించారు. సుబ్బారావు ఇటీవల ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకోగా కిరీటం కనిపించలేదు. ఆలయ కమిటీ నేతల్ని అడిగితే బ్యాంకు లాకరులో ఉందని చెప్పారు. మరోసారి ఆలయానికి వెళ్లి.. 'ఓసారి కిరీటాన్ని అలంకరించండి. 81 ఏళ్ల వయసు గలవాడిని, కిరీటంతో స్వామిని చూడాలని ఆశగా ఉంది' అని కోరితే.. మళ్లీ వేరే బ్యాంకు లాకరులో ఉందన్నారు. దీంతో సుబ్బారావు ఆరా తీయగా.. కల్యాణ మండపం ఆధునికీకరణకు కిరీటాన్ని కుదువ పెట్టినట్లు తెలిసి హతాశుడయ్యారు.

## ఇండియా- ఆఫ్రికా ఫోరమ్ సమిట్ వాయిదా

తేదీలను పరస్పర సంప్రదింపుల ద్వారా ఖరారు చేస్తామని తెలిపింది. "ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి సంబంధించి విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆఫ్రికా సీడీసీ, సంబంధిత సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉంది" అని విదేశాంగశాఖ పేర్కొంది. మరోవైపు.. ఎబోలా వైరస్ వ్యవహారంలో దిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, నీరసం, కండరాల నొప్పులు తదితర సమస్యలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్టు వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎబోలా కారణంగా ఇప్పటివరకు 139 మంది మృతి చెందారు. దాదాపు 600 అనుమానిత కేసులను గుర్తించారు. కాంగోలో వైరస్ వ్యాప్తిని ఎదుర్కొనేందుకు తమకు మరింత సామగ్రి, సిబ్బంది అవసరమని అధికార వర్గాలు, సహాయక బృందాలు కోరాయి. మొదటి మరణం నమోదైన బునియా ప్రాంతానికి దాదాపు 20 టన్నుల సహాయ సామగ్రిని తరలించినప్పటికీ.. ఐసొలేషన్ గదుల కొరత కారణంగా వైద్యులు సాధారణ వార్డుల్లోనే ఎబోలా అనుమానిత రోగులకు చికిత్స అందిస్తున్నారు.

## ఎండగట్టిన భారత్

జరిగింది. ఈ సందర్భంగా పాక్ ప్రతినిధి జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ గట్టిగా తిప్పికొట్టారు. నరమేధ చర్యలకు పాల్పడే దేశం.. భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది ఆరంభంలో అఫ్గానిస్థాన్‌పై పాక్ జరిపిన దాడుల గురించి హరీష్ ప్రస్తావించారు. పవిత్ర రంజాన్ మాసంలో కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన దాడిని ప్రపంచం ఇంకా మరిచిపోలేదన్నారు. ఈ అమానుషమైన హింసాకాండలో 269 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 122 మంది గాయపడినట్లు తెలిపారు. 'చీకట్లో అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ.. అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనం' అని విమర్శించారు. తన సొంత ప్రజల పైనే బాంబులు వేస్తూ, జాతి నిర్మూలనకు పాల్పడే దేశం ఇలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడటం పెద్ద ఆశ్చర్యం కలిగించే విషయం కాదన్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై ఏపీలో కేసు నమోదు

ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై, సంబంధిత టీవీ ఛానెల్‌పై కేసు నమోదు చేశారు. జనసేన కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఇటీవల జరిగిన ఓ టీవీ డిబేట్‌లో నాగేశ్వర్ మాట్లాడుతూ.. గతంలో పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ ఢిల్లీలో అమిత్ షాను కలిసి వైఎస్ జగన్‌ను అరెస్టు చేయాలని కోరారని పేర్కొన్నారు. దీనికి అమిత్ షా స్పందిస్తూ, "రాజకీయాల్లో ఇన్‌స్టంట్ ఫ్రెండ్, లాంగ్ టర్మ్ ఫ్రెండ్ ఉంటారు. చంద్రబాబు ఇన్‌స్టంట్ ఫ్రెండ్ (తాత్కాలిక స్నేహితుడు), జగన్ లాంగ్ టర్మ్ ఫ్రెండ్ (చిరకాల మిత్రుడు). మనకు 25 మంది ఎంపీలతో జగన్ సహకరిస్తున్నారు కదా, మీరు కూడా వైఖరి మార్చుకోండి" అని వారికి సలహా ఇచ్చినట్లు నాగేశ్వర్ వ్యాఖ్యానించారు. అమిత్ షా అనని మాటలను అన్నట్లుగా ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా నాగేశ్వర్ వ్యాఖ్యలు ఉన్నాయని జనసేన కార్యకర్తలు తమ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపడంతో, ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై, ఆ కార్యక్రమాన్ని ప్రసారం చేసిన టీవీ ఛానెల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటలు

భక్తులను క్యూలైన్లలోకి అనుమతించారు. ఈరోజు ఉదయం నాటికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు ఆక్టోపస్ భవనం వరకు బారులు తీరాయి. ప్రస్తుతం సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు దర్శనానికి 30 గంటలు, టోకెన్లు ఉన్నవారికి 6 నుంచి 7 గంటల సమయం పడుతుందని టీటీడీ తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 4 నుంచి 5 గంటల సమయం పడుతోంది. బుధవారం ఒక్కరోజే 86,315 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 44,107 మంది తలనీలాలు సమర్పించారు. హుండీ ఆదాయం రూ.3.94 కోట్లుగా నమోదైంది. భక్తుల రద్దీ దృష్ట్యా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. క్యూలైన్లలోని భక్తులకు అన్నపానీయాలు అందిస్తూ, ఎండల తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకుంటోంది.

## నిప్పుల కొలిమి

నిన్న 47.6 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రత, ఇవాళ మరింత పెరిగి 48.1 డిగ్రీలకు చేరింది. రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. ఇక ఇతర ప్రాంతాల్లోనూ భానుడు భగభగమంటున్నాడు. బాపట్ల జిల్లా వేటపాలెం, కృష్ణా జిల్లా నందివాడలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎన్టీఆర్ జిల్లా టి.గుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీలు, ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నెల్లూరు జిల్లా కావలిలో 46.4 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నాడు 18 జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా, 20 జిల్లాల్లోని సుమారు 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వచ్చే సోమవారం వరకు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఇదే విధంగా కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది.

## జగన్‌కు 'భాస్కర్ అవార్డు' గ్యారంటీ

చేసిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. "2019లో సొంత బాబాయిని లేపేసింది జగన్. మొదట గుండెపోటు అన్నారు, తర్వాత గొడ్డలి వేటు అని బయటకు వచ్చింది. ఆ తర్వాత దొంగ పేపర్‌లో నారాసుర రక్తచరిత్ర అని రాసి చంద్రబాబు చేతిలో కత్తి పెట్టి ఫోటో వేశారు. కానీ, జగన్ ఎంత మోసగాడో ప్రజలకు అర్థమైంది. అందుకే వైసీపీకి ముద్దుగా గొడ్డలి పార్టీ అని పేరు పెట్టాం" అని లోకేష్ అన్నారు. జగన్ నటన చూస్తే తనకే ఆశ్చర్యం వేస్తుందని, బయట ముద్దులు పెట్టి లోపల గొడ్డలి పోట్లు వేయడం ఆయనకు అలవాటని వ్యాఖ్యానించారు. రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్ అని, రియల్ ఎస్టేట్ వ్యాపారి దస్తగిరిని జగన్ మేనమామ చంపేసి, తమపై కేసులు పెడతామని బెదిరించారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు కేసులకు భయపడతామా అని ప్రశ్నించారు. కడపలో ఒక పెద్దాయన ఎగిరెగిరి పడుతున్నారని, త్వరలో ఆయన సమయం కూడా వస్తుందని, చట్టాలను ఉల్లంఘించిన వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

**2029లోగా కడప స్టీల్ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభం**

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడపకు ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారా, ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా అని లోకేష్ ప్రజలను ప్రశ్నించారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే బాధితులను పట్టించుకోలేదని విమర్శించారు. "యువగళం పాదయాత్రలో ఇదే కడప గడ్డపై నేను మిషన్ రాయలసీమను ప్రకటించాను. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తానని మాట ఇచ్చి, ఇప్పుడు ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నాం. గత రెండేళ్లలో రూ.లక్ష కోట్ల విలువైన పరిశ్రమలు రాయలసీమకు తెచ్చాం. 2029 ఎన్నికలలోపు కడప స్టీల్ ప్లాంట్‌లో కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభించే బాధ్యత నేను తీసుకుంటా," అని లోకేష్ హామీ ఇచ్చారు.

**కూటమి మధ్య చిచ్చుకు సైకో బ్యాచ్ కుట్ర**

కూటమి మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ సైకో బ్యాచ్ కుట్రలు పన్నుతోందని లోకేష్ ఆరోపించారు. "జనసేన ముసుగులో మనల్ని, టీడీపీ ముసుగులో జనసేనను ఫేక్ అకౌంట్లలో తిడతారు. మనమంతా అప్రమత్తంగా ఉండాలి. కూటమి కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా జగన్ ముఠా కుట్రలను తిప్పికొట్టాలి," అని పిలుపునిచ్చారు. కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని, పల్నాడులో తోట చంద్రయ్య వంటి కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు.

**చేసిన మంచిని చెప్పాల్సిన బాధ్యత కేడర్ దే**

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని లోకేష్ తెలిపారు. పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచామని, దీని కోసమే ఏటా రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మత్స్యకార భరోసా, చేనేత, మరమగ్గాలకు ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. 16 వేల టీచర్ పోస్టులు, 6 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశామని, ఉగాదికి 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చామని గుర్తు చేశారు. తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని సూచించారు.

**కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలి**

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేందుకు పాస్‌పోర్టు మాత్రమేనని, కార్యకర్తలు ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని మమేకం కావాలని లోకేష్ హితవు పలికారు. టీడీపీ కేడర్‌పై గత పాలకులు పెట్టిన తప్పుడు కేసులను తొలగించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. "మా చుట్టూ తిరిగితే పదవులు రావు, ప్రజల చుట్టూ తిరిగితే పదవులు వెదుక్కుంటూ వస్తాయి. పనిచేసే వారిని గుర్తించడానికే మైటీడీపీ యాప్ తీసుకువచ్చాం" అని తెలిపారు.

**వర్చువల్ మహానాడును విజయవంతం చేయండి**

అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పిలుపు మేరకు ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని లోకేష్ తెలిపారు. ప్రతి క్లస్టర్‌లో కార్యకర్తలను సమీకరించి మహానాడును విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన బాధ్యత మరింత పెరిగిందని, తనకు అప్పగించిన ప్రతి పనినీ చిత్తశుద్ధితో చేస్తానని అన్నారు.

**గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండండి**

నాయకులు, కార్యకర్తలు గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని లోకేష్ గట్టిగా సూచించారు. పార్టీ శాశ్వతమని, గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించవద్దని కోరారు. అధికారం వచ్చిందని అహంకారం చూపొద్దని, ప్రజలు ప్రతి కదలికను గమనిస్తున్నారని హెచ్చరించారు. అందరం కలిసికట్టుగా పనిచేసి 2029లో ఎన్డీఏను గెలిపించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి కోరినట్లు కడపలోని అర్బన్ పాఠశాలలకు మౌలిక వసతులు, చెరువుల ఆధునీకరణకు నిధులు కేటాయించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**కడపలో మంత్రి నారా లోకేష్ 89వ రోజు ప్రజాదర్బార్**

నియోజకవర్గ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశం అనంతరం నారా లోకేష్ 89వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్రంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంతో పాటు కులగణన నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. భూనిర్వాసిత కోటాలో నియమితులైన జేపీఏ ఉద్యోగుల సీనియారిటీని యథావిధిగా వన్ టైం బేసిస్ భూ నిర్వాసితుల ప్రాధాన్యత కోటా కింద కొనసాగించాలని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ భూ నిర్వాసిత రైతుల హక్కుల పరిరక్షణ ఐక్యవేదిక ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పుంగనూరు పట్టణంలోని ప్రమీలా నగర్ లో రోడ్డు ఆక్రమణకు గురైందని, సర్వే నిర్వహించి దారి ఏర్పాటుచేయాలని పట్టణానికి చెందిన హేమాద్రి కోరారు. కడప జిల్లా, పట్టణంలో బలిజ భవనానికి 50 సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు బలిజ కాపులకు ఈడబ్ల్యూఎస్ కింద 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని జిల్లా బలిజ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## జగన్‌పై మంత్రి నాదెండ్ల ఫైర్

అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాదెండ్ల మనోహర్ అన్ని విమర్శలకు గణాంకాలతో సహా ఘాటుగా సమాధానమిచ్చారు.

**దీపం పథకంపై పారదర్శకంగా ఉన్నాం**

"దీపం పథకం కింద అర్హులైన వారందరికీ గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, దీన్ని కూడా జగన్ రాజకీయం చేయడం దారుణం" అని మనోహర్ అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే నాలుగు విడతలుగా ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. ఇప్పటివరకు నాలుగు విడతల్లో దాదాపు 3.77 కోట్ల మంది లబ్ధిదారులకు రూ. 3,037 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామని వివరించారు. ప్రస్తుతం ఐదో విడత కొనసాగుతోందని, ఇప్పటికే 48 లక్షల మంది బుక్ చేసుకున్నారని చెప్పారు. "ఇది జగన్ ప్రభుత్వంలో లాగా బటన్ నొక్కే కార్యక్రమం కాదు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈకేవైసీ, ఆధార్ అనుసంధానం ద్వారా పారదర్శకంగా అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో కోటి 20 లక్షల కనెక్షన్లు ఉన్నా, డబుల్ కనెక్షన్లు, కమర్షియల్ కనెక్షన్లు, అర్హత లేనివి పోగా, అర్హులందరికీ పథకం అందుతోంది" అని స్పష్టం చేశారు.

**మధ్యాహ్న భోజనంపై సవాల్**

డొక్కా సీతమ్మ గారి స్ఫూర్తితో పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై జగన్ చేసిన విమర్శలను మనోహర్ తిప్పికొట్టారు. "పొరుగు రాష్ట్రాల్లో ఎక్కువ ధర ఉన్నా, మన రైతులు త్యాగం చేసి ప్రభుత్వానికి నాణ్యమైన బీపీటీ, సోనా మసూరి బియ్యాన్ని అందించారు. క్యూఆర్ కోడ్ ట్యాగింగ్‌తో పండించిన రైతు నుంచి పాఠశాలకు చేరే వరకు ప్రతి దశను పారదర్శకంగా ట్రాక్ చేస్తున్నాం. దమ్ముంటే ఏ పాఠశాలకైనా వచ్చి భోజనం నాణ్యతను పరిశీలించాలని జగన్‌కు నేను సవాల్ విసురుతున్నాను" అని అన్నారు.

**హెలికాప్టర్ వాడిన ఘనత జగన్‌ది**

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రయాణాలపై జగన్ చేసిన విమర్శలపై నాదెండ్ల తీవ్రంగా స్పందించారు. "ప్రపంచంలోనే అరుదైన రికార్డు జగన్‌కు ఉంది. ఉండవల్లిలోని తన ఇంటి నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని అమరావతికి హెలికాప్టర్‌లో వెళ్లిన మహానుభావుడు ఆయన. తన ఐదేళ్ల పాలనలో స్పెషల్ ఫ్లైట్లు, హెలికాప్టర్ల కోసం రూ. 222 కోట్లు ప్రజాధనం ఖర్చు చేసిన జగన్, ఈరోజు ఇతరులను విమర్శించడం హాస్యాస్పదం" అని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ పార్టీ పనులకు పార్టీ నిధులతో, వ్యక్తిగత పనులకు తన సొంత సంపాదనతో ప్రయాణిస్తారని, జగన్‌లా కాంట్రాక్టర్లను బెదిరించి ప్రైవేట్ విమానాల్లో తిరగలేదని అన్నారు.

**అమరావతిపై పైశాచిక ఆనందం**

అమరావతి రైతుల త్యాగాన్ని గుర్తించకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను నాదెండ్ల తీవ్రంగా ఖండించారు. "అమరావతి రైతుల క్షోభను చూసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. రాజధాని కోసం రైతులు పడిన బాధను, ప్రాణత్యాగాలను విస్మరించి మాట్లాడటం జగన్ అహంకారానికి నిదర్శనం. మూడు గీతలు గీస్తే రాజధాని అయిపోతుందనుకోవడం మూర్ఖత్వం. ఐదేళ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తి, కనీస సమాచారం లేకుండా బురదజల్లే కార్యక్రమాలు మానుకోవాలి" అని హితవు పలికారు.

## బక్రీద్ సెలవు ఈనెల 28న

ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మేరకు బక్రీద్ సాధారణ సెలవును ఈనెల 27కు బదులు 28వ తేదీ గురువారానికి మార్పు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సిఎస్ ఈఉత్తర్వులు జారీ చేశారు.కావున ఈనెల 27వతేది బుధవారం సెలవును 28వతేది గురువారానికి మార్చడంతో 27వతేది బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలన్నీ యదావిధిగా పని చేస్తాయని సిఎస్ సాయి ప్రసాద్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అదే విధంగా షాపులు, ఇతర ఎస్టాబ్లిష్మెంట్లకు సంబంధించి నెగోషియబుల్ ఇనుస్ట్రమెంట్ యాక్ట్ 1881 కు అనుగుణంగా బక్రీద్ సాధారణ సెలవును ఈనెల 27వ తేది బుధవారానికి బదులుగా 28వ తేది గురువారానికి మార్పు చేస్తూ జిఓఆర్టి సంఖ్య:1007 ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## కార్మికులకు శుభవార్త

జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుంది.

**విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి**

నైపుణ్యాలు పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నాం. నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాల్లో రూ.2లక్షల వరకు వేతనం ఉంటుంది. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించలేని చదువులు వ్యర్థం. జర్మనీ, జపాన్, సింగపూర్‌లలో ఎన్నో ఉద్యోగాలు ఉన్నాయి. రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి. ఏఐ వల్ల వైట్‌కాలర్ ఉద్యోగాలకే ముప్పు.. బ్లూ కాలర్ ఉద్యోగాలకు ఉండదు. నైపుణ్యాలు ఉన్న వారు కావాలని విదేశాలు మమ్మల్ని సంప్రదిస్తున్నాయి.

**బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు**

వాహనాలు తనిఖీ చేస్తుండగా బండి భగీరథ్‌ను అరెస్టు చేశామని పోలీసులు చెప్పారు. పోలీసులు చెప్పిందే నమ్ముతా. బండి సంజయ్ అప్పగిస్తే... ఇంటికి పోలీసులను పిలిచి అప్పగించాల్సి ఉండేది. అప్పా జంక్షన్ వద్ద భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పా జంక్షన్ ఏమైనా బండి సంజయ్ ఇల్లా? రోడ్డు మధ్యలో భగీరథ్‌ను అదుపులోకి తీసుకుంటే సరెండర్ ఎలా అవుతుంది. నేను పోలీసుల మాట నమ్మాలా?.. నేతల మాటలు నమ్మాలా? ఫిర్యాదు అందిన వెంటనే పద్ధతి ప్రకారం చర్యలు తీసుకున్నాం. బీఆర్ఎస్ నేతలు సిగ్గు తప్పి వ్యవహరిస్తున్నారు. వారే విచారించి.. వాళ్లే తీర్పు ఇచ్చేస్తున్నారు. పోక్సో కేసులో మైనర్ వివరాలు వెల్లడిస్తే.. వాళ్లకు ఎంతో ఇబ్బంది. బాలిక విషయంలో రాజకీయాలు చేయటం ఎందుకు? కేటీఆర్ కావాలంటే.. రాజకీయంగా కొట్లాడాలి" అని సీఎం అన్నారు.

## కీలక పదవి ఇచ్చిన ఏపీ ప్రభుత్వం

చిక్కాల మెహర్ రమేష్ కుమార్ (మెహర్ రమేష్) నియమితులయ్యారు. గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్న ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని భర్తీ చేయడంతో పాటు, 14 మందిని డైరెక్టర్లుగా నియమించారు. ఈ నియామకాలతో సంస్థ కార్యకలాపాలకు కొత్త ఉత్తేజం వచ్చినట్లయింది. ఇక, బోర్డు డైరక్టర్లుగా నియమితులైన వారిలో ప్రముఖ సినీ రచయి బుర్రా సాయి మాధవ్, చిలకలూరిపేటకు చెందిన రిటైర్డ్ అధ్యాపకులు, రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావులు ఉన్నారు. నటుల విభాగంలో సీనియర్ నటుడు సుమన్, శివాజీ, నటి ఝాన్సీలను డైరెక్టర్లుగా ఎంపిక చేశారు. దర్శకుల్లో ఎస్.వి. కృష్ణారెడ్డి, వి.సముద్రలకు ఈ జాబితాలో చోటు దక్కింది. అలాగే, నిర్మాతలు చదలవాడ శ్రీనివాసరావు, కూచిభోట్ల వివేకానంద కూడా డైరెక్టర్లుగా నియమితులయ్యారు. వీరితో పాటు సీనియర్ జర్నలిస్ట్ కె. ఉమా మహేశ్వరరావు, మీర్ ఎస్., ఎ. సత్యనారాయణ, జి. రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి. సత్యనారాయణలను కూడా డైరెక్టర్ల బృందంలోకి తీసుకున్నారు. ఈ నియామకాల ద్వారా వివిధ రంగాల అనుభవజ్ఞులకు అవకాశం కల్పించినట్లయింది.

### 20సూత్రాల అమలులో

## కోనసీమ జిల్లా ముందుండాలి

జాయింట్ కలెక్టర్ నిదియా దేవి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదరిక నిర్మూలనకు, గ్రామీణాభివృద్ధికి, సామాజిక న్యాయానికి ఒక దిక్సూచిగా నిలిచి సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 20 సూత్రాల కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఈ నెల 22న నిర్వహించనున్న 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్‌పర్సన్ లంకా దినకర్ ఆధ్వర్యంలోని సమీక్షా సమావేశానికి ముందుగా, ఇప్పటివరకు సాధించిన ప్రగతిపై జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, అమృత్ 2.0, జల జీవన్ మిషన్, ప్రధానమంత్రి సూర్య ఘర్, పీఎం కుసుమ్, వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ తదితర ప్రధాన విభాగాల ప్రగతి నివేదికలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యత అంశాలలో ప్రగతి సాధించడం అధికారుల బాధ్యత అని తెలిపారు. 20 సూత్రాల పథకం కేవలం పేదరిక నిర్మూలనకే పరిమితం కాకుండా ఉపాధి కల్పన, గ్రామీణాభివృద్ధి, వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ మిషన్ కింద కూలీలకు సకాలంలో పనులు, వేతనాలు అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు, సురక్షితమైన తాగునీరు, నాణ్యమైన పునరుత్పాదక ఇంధన వనరుల ప్రోత్సాహం కింద పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ ద్వారా విద్యుత్ అందించడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును మెరుగుపరచి గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించి ఆరోగ్యకర సమాజ స్థాపన దిశగా కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పొదుపు సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా బ్యాంక్ లింకేజీలు, రుణ సదుపాయాలను వేగవంతం చేయాలన్నారు. వివిధ సంక్షేమ పథకాల అమలుతో క్షేత్రస్థాయిలో సమూల మార్పులు చోటుచేసుకోవాలని పేర్కొన్నారు. ఏ పథకమైనా లబ్ధిదారుడి ముఖంలో నవ్వు తీసుకొచ్చినప్పుడే ఆ పథకానికి, దాన్ని అమలు చేసిన వ్యవస్థకు సార్థకత లభిస్తుందని అన్నారు. కేటాయించిన నిధులు సకాలంలో, దుర్వినియోగం కాకుండా ఖర్చు చేయడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఎక్కడైనా అలసత్వం వహిస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రతి శాఖాధికారి తమ పరిధిలోని ప్రగతి నివేదికలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలు పెంచి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. 20 సూత్రాల కార్యక్రమాల అమలులో కోనసీమ జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు అందరూ బృంద స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. డీఆర్వో వి. సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల "ఒక గ్రామం – ఒక నెల – నాలుగు సార్లు పర్యటన" కార్యక్రమాన్ని రద్దు చేసి, దాని స్థానంలో "ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు పర్యాయాల పర్యటన" కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం జిల్లా కలెక్టర్, సంబంధిత శాసనసభ్యులు, అధికారులు కలిసి పర్యటిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ బి. రాజేశ్వరి, డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావు దొర, డీఈవో నాగేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ వీఎస్ రాజన్, జిల్లా అర్థగణాంకాధికారి ఎం. మురళీకృష్ణ, వయోజన విద్య నోడల్ అధికారి విజయభాస్కరరావు, డీసీహెచ్ఎస్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల సమస్యలను

## అడిగి తెలుసుకున్న కుడుపూడి సత్తిబాబు


**ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలోని స్థానిక మూడవ వార్డు పరిధిలోని రాజేంద్రనగర్, నెహ్రూ నగర్ ప్రాంతాల్లో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు గురువారం సాయంత్రం వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మరియు సబ్ ఇన్స్పెక్టర్లతో కలిసి పర్యటించారు. స్థానికంగా నివసిస్తున్న ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకొని రాజమహేంద్రవరం నగరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా రాత్రివేళల్లో ఆకతాయిలు, అల్లరి మూకలు సంచరిస్తున్న విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన సత్తిబాబు పోలీసు అధికారులతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో గస్తీ మరింత పెంచాలని కోరారు. ముఖ్యంగా చీకటి ప్రదేశాలు, ప్రధాన కూడళ్లు మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పేర్కొన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అవసరమైన ప్రాంతాల్లో రాత్రి గస్తీ పెంచడమే కాకుండా, అల్లరిగా తిరుగుతున్న యువకులకు స్టేషన్ స్థాయిలో కౌన్సిలింగ్ నిర్వహించాలని పోలీసులను కోరారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**అధికారులకు ఎమ్మెల్యే ఆనందరావు ఆదేశం – బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గ పరిధిలో ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే ధ్యేయంగా బ్రిడ్జిల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అమలాపురం శాసన సభ్యుడు అయితాబత్తుల ఆనందరావు అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం అయితాబత్తుల ఆనందరావు పరంజ్యోతి పబ్లిక్ స్కూల్ సమీపంలో నిర్మాణ దశలో ఉన్న రెండు బ్రిడ్జిల పనులను, అలాగే బైపాస్ రోడ్డులోని నల్ల చంద్రరావు ఘాట్ వద్ద జరుగుతున్న మరో బ్రిడ్జి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులు, నిర్మాణ సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి, ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించడానికి ఈ బ్రిడ్జిల నిర్మాణం ఎంతో కీలకమన్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనుల్లో వేగం పెంచాలని, ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రాబోయే రోజుల్లో అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మదర్ తెరిసా ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు

## దిడ్ల కిషోర్ పుట్టినరోజు వేడుకలు




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలపరిధి ఊబలంక గ్రామంలోని మదర్ తెరిసా ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు దొడ్ల కిషోర్ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కిషోర్ కు పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, అధికారులు, పెద్దలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన స్నేహితులు అభిమానులు ఆశ్రమంలోని దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేయించి సాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కిషోర్ ఆశ్రమం ద్వారా చేస్తున్న సేవలను కొనియాడారు. పుట్టినరోజు వేడుకల్లో బోయిడ్ వెంకన్న బాబు (బద్రి), పెరవలి గణేష్, కొండేటి గంగాధర్, కుడుపూడి నరేష్, మల్లేశ్వరపు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి


**కేతరాజుపల్లి ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డబుల్ ఇంజన్ సర్కార్ నేతృత్వంలో దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. గురువారం రావులపాలెం మండలం కేతరాజుపల్లి గ్రామ పంచాయతీ వద్ద ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం తన కాన్వాయ్ ను పక్కనపెట్టి ఎలక్ట్రిక్ స్కూటర్ ను స్వయంగా నడుపుకుంటూ రావులపాలెం మండలం కేతరాజుపల్లి సభాస్థలికి చేరుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఇంధన పొదుపు, కర్బన ఉద్గారాల కట్టడి, పర్యావరణ పరిరక్షణలో కీలకమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాల్సి ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రెండు ఇంజన్లతో నడుస్తుందని,రాష్ట్రంలో దానికి తగ్గ అభివృద్ధి జరుగుతుందన్నారు.2024 ఎన్నికల్లో గెలిచిన సందర్భంలో 2019- 24 ఐదేళ్ల కాలంలో జగన్ రాష్ట్రాన్ని ఆర్థికంగా అధోగతి పాలు చేశాడు ఇప్పటినుంచి పరిపాలన ఎలా సాగుతుందో? అనుకున్నామని అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతంగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని, ప్రధాని మోడీ సహకారం అందిస్తున్నారని ఆయన కొనియాడారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ జరుగుతున్నాయన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు అర్జీలు స్వీకరించారు. మొత్తం 32 వినతులు ప్రజలనుంచి అందగా పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

## కార్యకర్తకే పెద్దపీట..

**మహానాడుపై సీఎం నారా చంద్రబాబు నాయుడు**



ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న మహానాడులో కార్యకర్తలకే పెద్ద పీట వేయాలని పార్టీ అదినేత, సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. కార్యకర్తల సెంట్రిక్ గానే కార్యక్రమాలను రూపొందించాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు నిర్వహించే మహానాడును పొదుపు చర్యల్లో భాగంగా పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా గురువారం.. పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం నిర్వహించారు. వర్చువల్‌గా నిర్వహించిన ఈ సమావేశంలో మహానాడుకు సంబంధించిన పలు కీలక అంశాలపై చంద్ర బాబు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని.. మహానాడులో ఈ స్ఫూర్తి ప్రతి విషయంలో నూ కనిపించాలని సూచించారు. అదేవిధంగాపార్టీలోను.. ప్రభుత్వంలోనూ మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. టీడీపీ వ్యవస్థాగత ఓటు బ్యాంకును కాపాడుకునేలా కార్యాచరణ ఉండాలన్నారు. మరీ ముఖ్యంగా బీసీలకు పార్టీ ఇస్తున్న ప్రాధాన్యం.. రాబోయే రోజుల్లో పార్టీలో తీసుకునే చర్యలను కూడా ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సంక్షిప్తంగా.. ఇచ్చిన సబ్జెక్టుపైనే మాట్లాడా లని.. ప్రశంసలకు చోటు ఇవ్వొద్దని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మందికి అవకాశం కల్పించే దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా మహానాడులో ప్రవేశపెట్టే 19 తీర్మానాలకు పొలిట్‌బ్యూరో సభ్యులు ఆమోదం తెలిపారు.

**పొదుపు పాటించాలి..**


ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన ఇంధన పొదుపు చర్యలపై పొలిట్ బ్యూరోలో చంద్రబాబు చర్చిం చారు. గడిచిన 2 ఏళ్ల ప్రభుత్వ పాలనా విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా రూపొందించిన కార్యాచరణపై సమావేశంలో సభ్యుల అభిప్రాయాలు తెలుసూఉకున్నారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని.. మహానాడు అనంతరం.. అందరూ ప్రజల మధ్య ఉండాలని పేర్కొన్నారు.



ఇంధన పొదుపు దేశాభివృద్ధికి

**మదుపని చాటిన ఎమ్మెల్యే**

ఎలక్ట్రిక్ స్కూటర్ నడుపుకుంటూ సభాస్థలికి వచ్చి స్ఫూర్తిదాయకంగా నిల్చిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



### కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని

# సందర్శించిన ఐజీపీ అశోక్ కుమార్

## వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ ప్రధాన కార్యాలయం పరిశీలన



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో ఏలూరు రేంజ్ ఐజీపీ జి.వి.జి. అశోక్ కుమార్, ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయం, అమలాపురంలో ఏలూరు రేంజ్ ఐజీపీ జి.వి.జి. అశోక్ కుమార్, ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం మరియు ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్, పోలీస్ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాల రికార్డులను పరిశీలించిన ఐజీపీ, అధికారులకు తగిన సూచనలు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమర్థవంతమైన పోలీసింగ్ సేవలు అందిస్తూ నేర నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో కేసులను త్వరితగతిన ఛేదించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. డ్రగ్ డిటెక్షన్ కిట్ల సహాయంతో అనుమానితుల మూత్రం లేదా లాలాజల నమూనాలను పరీక్షించి, మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించాలని సూచించారు. మత్తుకు బానిసలైన వారికి కౌన్సిలింగ్ అందించి, డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. మత్తు పదార్థాల విక్రయం, రవాణా లేదా వినియోగంలో పాల్గొన్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నెంబర్ లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం, శక్తి యాప్ వినియోగంపై మహిళ కానిస్టేబుళ్లతో కూడిన శక్తి బృందాల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, వేధింపులు వంటి మహిళలపై జరిగే నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. ఎవరైనా ఓటీపీ లేదా ఇతర మోసాల ద్వారా డబ్బులు కోల్పోతే వెంటనే మూడు గంటల్లోపు 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తే సొమ్మును ఫ్రీజ్ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారులపై రాత్రివేళల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. బ్లాక్ స్పాట్ల గుర్తింపు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్మ్డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్, ఎంటీఓ విభాగాల్లో వాహనాలు మరియు రికార్డులను తనిఖీ చేసి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ తనిఖీల సందర్భంగా అడిషనల్ ఎస్పీ, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ విభాగానికి చెందిన డీఎస్పీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, సోషల్ మీడియా ఇన్స్పెక్టర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్, పోలీస్ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాల రికార్డులను పరిశీలించిన ఐజీపీ, అధికారులకు తగిన సూచనలు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమర్థవంతమైన పోలీసింగ్ సేవలు అందిస్తూ నేర నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో కేసులను త్వరితగతిన ఛేదించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. డ్రగ్ డిటెక్షన్ కిట్ల సహాయంతో అనుమానితుల మూత్రం లేదా లాలాజల నమూనాలను పరీక్షించి, మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించాలని సూచించారు. మత్తుకు బానిసలైన వారికి కౌన్సిలింగ్ అందించి, డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. మత్తు పదార్థాల విక్రయం, రవాణా లేదా వినియోగంలో పాల్గొన్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నెంబర్ లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం, శక్తి యాప్ వినియోగంపై మహిళ కానిస్టేబుళ్లతో కూడిన శక్తి బృందాల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, వేధింపులు వంటి మహిళలపై జరిగే నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. ఎవరైనా ఓటీపీ లేదా ఇతర మోసాల ద్వారా డబ్బులు కోల్పోతే వెంటనే మూడు గంటల్లోపు 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తే సొమ్మును ఫ్రీజ్ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారులపై రాత్రివేళల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. బ్లాక్ స్పాట్ల గుర్తింపు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్మ్డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్, ఎంటీఓ విభాగాల్లో వాహనాలు, రికార్డులను తనిఖీ చేసి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ తనిఖీల సందర్భంగా అడిషనల్ ఎస్పీ, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ విభాగానికి చెందిన డీఎస్పీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, సోషల్ మీడియా ఇన్స్పెక్టర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉగ్రవాదానికి వ్యతిరేకంగా

# ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలవాలి


**జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజలకు తన సందేశం అందించారు. దేశ సమైక్యత, సమగ్రత, శాంతి భద్రతలకు ఉగ్రవాదం అతిపెద్ద ముప్పుగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదం మానవత్వానికి విరుద్ధమైందని, అది దేశ అభివృద్ధిని అడ్డుకునే ప్రమాదకర శక్తి అని అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి పౌరుడు దేశభక్తి భావంతో ముందుకు సాగాలని మంత్రి సుభాష్ పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా భారతీయులంతా ఒకటిగా నిలిచి దేశ సమగ్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించాల్సిన అవసరం ఉందని, హింసా మార్గాలను విడిచిపెట్టి శాంతి, సహనం, సౌభ్రాతృత్వం విలువలను ఆచరించాలని సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని తెలిపారు. దేశ భద్రత, ప్రజల ఐక్యతే భారత దేశం బలశీ. ఉగ్రవాదానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేకుండా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం అని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు నిచ్చారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉగ్రవాద నిర్మూలన కోసం చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమన్నారు.

# అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలి

**ఎంబీసీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు**



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ పరిధిలో ఈ నెల 21 నుండి 25 వరకు ఉష్ణోగ్రతలు మరియు ఉక్కపోత అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలుపుతున్నారు. అయితే పగటిపూట ఎంత ఎండ తీవ్రత ఉన్నప్పటికీ ప్రజలు తట్టుకోగలరని కానీ రాత్రి వేళల్లో పదేపదే కరెంటు పోతే మాత్రం తీవ్రమైన ఉక్కపోత దోమల బెడదతో జనం అల్లాడిపోయే పరిస్థితి వస్తుందని నియోజకవర్గం ఎం.బీ.సీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల వల్ల రాత్రి సమయాల్లో కరెంట్ పోయినప్పుడు ఇళ్లలో ఉండలేక వేడిని తట్టుకోలేక చిన్న పిల్లలతో సహా ప్రజలు వీధుల్లోకి వచ్చేస్తున్నారని సామాన్యుల ఇళ్లలో ఇన్వర్టర్లు కూడా ఉండే పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నారు. కావున విద్యుత్ అధికారులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాత్రి వేళల్లో అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పత్రికా ముఖంగా కోరారు. ఒకవేళ ఏదైనా అత్యవసర కారణాల వల్ల కరెంట్ పోయినట్లయితే, వినియోగదారులు ఫోన్ చేసినప్పుడు విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి, తిరిగి విద్యుత్ సరఫరా ఎప్పుడు పునరుద్ధరిస్తారనే సమాచారాన్ని తక్షణమే అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఖరీఫ్ సాగుకు ముందస్తుగా సమాయత్తం కావాలి

**రామచంద్రాపురం మండల వ్యవసాయాధికారి టి.వి.ఆర్. మణిదీప్ పిలుపు**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురం మండల వ్యవసాయాధికారి టి.వి.ఆర్. మణిదీప్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులకు ఖరీఫ్ సాగుపై విస్తృత అవగాహన సదస్సులు ప్రారంభమయ్యాయి. మే 19 నుండి మే 31 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ ఖరీఫ్ అవగాహన ప్రచార కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సాగునీరు త్వరగా విడుదల కానుండటంతో రైతులందరూ ముందస్తుగా ఖరీఫ్ పనులు ప్రారంభించాలని కోరారు. ఇలా ముందస్తు సాగు చేపట్టడం వల్ల పంట కాలం త్వరగా పూర్తయి, కోతల సమయంలో వచ్చే తుఫానుల ముప్పు నుండి పంటను సురక్షితంగా కాపాడుకోవచ్చని, అలాగే ఎల్ నినో వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా సమర్థవంతంగా తట్టుకోవచ్చని వివరించారు. రామచంద్రాపురం మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌కు కావలసిన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు మరియు పురుగుల మందులను ఇప్పటికే సిద్ధంగా ఉంచామని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సీజన్‌లో రైతులు వ్యవసాయ శాఖ సూచనల ప్రకారం దీర్ఘకాలిక పంట రకాలను సాగు చేయవద్దని వాటికి బదులుగా తక్కువ లేదా మధ్యస్థ కాలపరిమితి గల రకాలను ఎంచుకోవడం ఎంతో ఉత్తమమని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా వరి కోతల తర్వాత మిగిలిన పొగాకు లేదా వరిగడ్డిని పొలాల్లో తగులబెట్టవద్దని రైతులకు గట్టిగా విజ్ఞప్తి చేశారు. గడ్డిని కాల్చడం వల్ల మట్టిలోని ప్రధాన పోషకాలతో పాటు రైతుకు మేలు చేసే స్నేహపూర్వక కీటకాలు నశించి భూమి నిస్సారమవుతుందని హెచ్చరించారు. అంతేకాకుండా ఆ పొగ వల్ల పర్యావరణం కలుషితమై మానవ ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని.ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, మండలంలోని రైతులందరూ మే 31 లోపు తమ తమ గ్రామాల్లో జరిగే వ్యవసాయ అవగాహన సదస్సులకు తప్పనిసరిగా హాజరై అధికారుల సూచనలను పాటిస్తూ ముందస్తు ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని మండల వ్యవసాయాధికారి మణిదీప్ కోరారు.

### మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమాను

# పరామర్శించిన బీజేపీ నాయకులు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమాను పరామర్శించిన బీజేపీ నాయకులు.భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు,పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నగరం మాజీ శాసనసభ్యులు మానేపల్లి అయ్యాజీ వేమా మాతృమూర్తి మానేపల్లి ద్రౌపతి ఇటీవల మృతి చెందారు గురువారం నాడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గంద్రోతు వీరగోవిందరావు. అయినవిల్లి సత్తిబాబు. కంకటాల వెంకటరత్నం (నాని), మద్దింశెట్టి శ్రీను, మేడపాటి వెంకట కృష్ణారెడ్డి. ఆంజనేయులు పలువురు నాయకులు రాజోలులో అయ్యోజీ వేమాను ఆయన నివాసం వద్ద పరామర్శించి ద్రౌపతి చిత్రపటానికి నివాళు లర్పించారు. వేమాని జిల్లాకు చెందిన పలువురు నాయకులు పార్టీ శ్రేణులు తదితరులు పరామర్శించారు.

# వరి పంట అవశేషాలు కాల్చవద్దు

**నష్టాలు-నివారణ చర్యలపై రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయంలో అధికారుల కీలక సమావేశం**




**రామచంద్రపురం, విశ్వ వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో గురువారం ఉదయం డివిజనల్ రెవెన్యూ అధికారిణి ఏ.సరళావతి అధ్యక్షతన పోలీసు మరియు వ్యవసాయ శాఖల అధికారులతో కలిసి వరి పంట అవశేషాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలు, నివారణ చర్యలపై ఒక ప్రాముఖ్యమైన ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు బి.నాగ కుమార్ మాట్లాడుతూ రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలోని రామచంద్రపురం మండలంలో 18,953 ఎకరాలు, కె.గంగవరం మండలంలో 16,287 ఎకరాలలో ఈ ధాళ్వా సీజన్ లో వరి పంటను పండించారని, ప్రస్తుతం వరి కోతలు పూర్తిగా పూర్తయ్యాయని తెలిపారు. అయితే కోతల అనంతరం పొలాల్లో మిగిలే వరిగడ్డి మరియు పంట అవశేషాలను కాల్చడం ఇటీవల ఎక్కువగా జరుగుతోందని ఇది తాత్కాలికంగా సులభ మార్గంగా కనిపించినప్పటికీ రైతులకు మరియు పర్యావరణానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పంట అవశేషాలు కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ కార్బన్ మరియు ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి నేలసారం తగ్గిపోతుందని ఒక టన్ను వరి అవశేషాలు కాల్చడం ద్వారా ఒక కిలో సేంద్రీయ కార్బన్‌తో పాటు, సుమారుగా 5.5 కేజీల నత్రజని, 2 కేజీల భాస్వరం, మరియు 2.5 కేజీల పొటాష్ వంటి ముఖ్యమైన పోషకాలను రైతులు నష్టపోతారని వివరించారు. దీనివల్ల నేల గట్టిపడి నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం తగ్గుతుందన్నారు. పర్యావరణ పరంగా చూస్తే గాలి కాలుష్యం పెరిగి కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలవుతాయని ఆ పొగ వల్ల రోడ్డుపై విజిబిలిటీ తగ్గి ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు. ఆరోగ్య పరంగా ముఖ్యంగా పిల్లలు మరియు వృద్ధులకు శ్వాసకోశ సమస్యలు, దగ్గు, కంటి మంటలు వస్తాయని తెలిపారు. అంతేకాకుండా ఈ మంటలు పక్క రైతుల పొలాలకు వ్యాపించి ఆస్తి నష్టం, గడ్డి మేటలు, ధాన్యపు రాసులు కాలిపోవడంతో పాటు ప్రాణ నష్టం, విద్యుత్ తీగలు మరియు చెట్లకు నష్టం జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ నష్టాల నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తూ, వరి అవశేషాలపై వేస్ట్ డికంపోజర్ ద్రావణాన్ని పిచికారి చేయడం ద్వారా లేదా యంత్రాల సహాయంతో వాటిని నేలలో కలియదున్నడం ద్వారా త్వరగా సేంద్రియ ఎరువుగా మార్చి భూసారాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. అలాగే ఈ అవశేషాలతో కంపోస్ట్ తయారు చేసుకోవచ్చని లేదా పశువుల మేతగా ఉపయోగించవచ్చని చెప్పారు. ముఖ్యంగా బేలర్ యంత్రం ద్వారా పొలంలో ఉన్న వరిగడ్డిని సేకరించి గట్టి బండిల్స్ (రోల్స్) గా మార్చడం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. ఒక ఎకరానికి 15 కేజీల బరువుండే 60 నుండి 80 బేలర్ రోల్స్ తయారు చేయవచ్చని, ఒక్కో రోల్ ఖరీదు ?100 వరకు పలుకుతుందని తెలిపారు. ఇందుకు రైతుకు అయ్యే ఖర్చు ?30 నుండి ?35 మాత్రమే కాబట్టి సరాసరి ప్రతి రైతుకు ఎకరానికి ?5,000 వరకు అదనపు ఆదాయం వస్తుందని స్పష్టం చేశారు. ఈ గడ్డిని పశువుల మేతగా మష్రూమ్ (పుట్టగొడుగుల) యూనిట్లకు, పేపర్ మిల్లులకు మరియు బయోమాస్ పరిశ్రమలకు సరఫరా చేయవచ్చని సూచించారు. ఈ విషయాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి 'భూమాత రక్షణ కమిటీల' ద్వారా ప్రతి నెల 1, 2 తేదీల్లో రైతు సేవా కేంద్రాల ఇన్చార్జీలు సమావేశాలు నిర్వహిస్తున్నారని అలాగే ఈనెల 19 నుండి ముందస్తు సాగునీరు విడుదల మరియు ఖరీఫ్ సాగు సమాయుత్తంపై మండల వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్న రోజువారీ సమావేశాల్లోనూ అవగాహన కల్పిస్తున్నామని చెప్తూ ఏ రైతు కూడా పంట అవశేషాలను కాల్చవద్దని నాగ కుమార్ విజ్ఞప్తి చేశారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.వెంకటనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ నాగేశ్వరరావు మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చడం వల్ల పక్క రైతులకు, ప్రజలకు ఆస్తి నష్టం జరుగుతుందని భూమిలోని మైక్రో ఆర్గానిజమ్స్ కాలిపోయి పోషకాలు ఆవిరైపోతాయని తెలిపారు. దీనివల్ల తదుపరి పంటకు సరైన పోషకాలు అందక, అదనపు ఎరువులు వాడాల్సి రావడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు పెరుగుతుందని చెప్పారు. ఇలా పంట అవశేషాలను కాల్చి పక్కవారి ఆస్తులకు నష్టం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. చివరగా రెవెన్యూ డివిజనల్ అధికారిణి ఏ.సరళావతి మాట్లాడుతూ రైతులెవరూ పంట అవశేషాలను కాల్చకుండా, వేస్ట్ డీకంపోజర్ ద్వారా వాటిని భూమిలోనే కుళ్ళింపజేసి భూసారాన్ని పెంచుకోవాలని అలాగే బేలర్ యంత్రాల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందాలని పిలుపునిచ్చారు. ఇదే సందర్భంలో ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చిన్న పిల్లలు కాలువలు చెరువులలో స్నానాలకు మరియు ఆటలకు వెళ్ళినప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించుకోవాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### రూ.2.90 లక్షలతో

# కాలువ పూడిక తీత పనులకు శ్రీకారం

**కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**




**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం కోలంక గ్రామంలో రూ.2.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న కాలువ పూడిక తీత పనులను కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ పనుల్లో భాగంగా ఇంజరం నార్త్ కాలువలో 3 కిలోమీటర్లు, మసకపల్లి కాలువలో 4.5 కిలోమీటర్ల మేర పూడిక తీత పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, ఈ పనుల ద్వారా సాగునీరు సాఫీగా అంది రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముందస్తు చర్యలు చేపడుతున్నారని అందులో భాగంగానే వంటకాలువలు, పూడికలు తొలగించి సాగునీటి సరఫరాకు ఆటంకాలు లేకుండా చూస్తున్నామని అన్నారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు తమకు అనుకూలమైన చోట ధాన్యం విక్రయించుకునే సువర్ణ అవకాశం కల్పించామని గుర్తుచేశారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని రైతుల ప్రయోజనాల కోసం ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు ఇరిగేషన్ ఏఈఈ అనూష, కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు, డీసీలు విజయ గోపాల్ రాజు, కృష్ణ చైతన్య, పేపకాయల బాబ్జీ, కూటమి పార్టీ నాయకులు వనుం వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు చేరుకున్న 80 శాతం పాఠ్యపుస్తకాలు

**స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు**

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, డిక్షనరీలు తదితర విద్యా సామగ్రిని సకాలంలో అందించేందుకు విద్యాశాఖ అన్ని చర్యలు చేపడుతోందని సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు తెలిపారు. రామచంద్రపురం పట్టణంలోని రత్నంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్ఆర్‌కేవీఎం స్టాక్ పాయింట్‌ను ఆయన గురువారం సందర్శించి పుస్తకాల పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 19 మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల అవసరాల కోసం 3,70,091 పాఠ్యపుస్తకాలు, 65,223 వర్క్‌బుక్స్, 4,660 డిక్షనరీల కొరకు ఇండెంట్ పంపగా, ఇప్పటి వరకు 80 శాతం సామగ్రి మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు చేరుకుందని వివరించారు. ఈ ఏడాది మొత్తం 53



టైటిల్స్ పాఠ్యపుస్తకాలు వస్తున్నాయని, మిగిలిన యూనిఫామ్, షూస్ తదితర సామగ్రి కూడా త్వరలోనే స్టాక్ పాయింట్లకు చేరుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల స్టాక్ పాయింట్లకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్‌ను తరగతుల వారీగా విభజించే ప్రక్రియను నిశితంగా పరిశీలించిన ఆయన, పుస్తకాలను భద్రపరిచే విషయంలో ఎలాంటి అశ్రద్ధ వహించరాదని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అదే పాఠశాలలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయబోయే విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న రెమిడియల్ (ప్రత్యేక) తరగతులను ఆయన సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవోలు) మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, సీఆర్పీ అరుణ తదితర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

శుక్రవారం, 22 మే 2026
www.viswamvoice.com





ప్రొఫెసర్ నాగేశ్వరరావు

## వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ జనసేన పార్టీ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో ప్రొఫెసర్ నాగేశ్వరరావు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల ఆయన తీవ్రంగా మండిపడ్డారు. జనసేన పార్టీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని, నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఈ మంచి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఒక పార్టీ వద్ద డబ్బులు తీసుకుని కూటమి ప్రభుత్వం పైన బురద జల్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా మా పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సివిల్ సప్లై శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కలిసి జగన్ ను అరెస్ట్ చేయండి అని చెబితేఅమిత్ షా జగన్ లాంగ్ టైమ్ ఫ్రెండ్, చంద్రబాబు నాయుడు షార్ట్ టైమ్ ఫ్రెండ్ అని చెప్పారని తప్పుడు ప్రచారాలు ఎందుకు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని విధాల సర్వనాశనం చేసి అప్పుల్లోకి నెట్టివేసిన విషయం అందరికి తెలిసిందే.రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుండి నిధులు తేవడానికి,జలజీవన్ మిషన్ అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారు. తప్పితే రాజకీయాల కోసం కాదు.. జగన్ సొంత నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ అభివృద్ధి చేసింది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని గుర్తు చేశారు. మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న విషయాలు తెలుసుకోకుండా ప్రొఫెసర్ నాగేశ్వరరావు వైసీపీ పేటియం బ్యాచ్ లో చేరి భారత దేశ హోమ్ శాఖ మంత్రిని కూడ తక్కువ చేసి మాట్లాడం చాలా దారుణం..తెలంగాణలో కూర్చుని ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కోసం నాగేశ్వరరావు మాట్లాడం ఏమిటివైసీపీ ప్రభుత్వంలో చేసిన విధ్వంసాలు.. కూటమి ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధి ఆయనకు కనపడటం లేదా అని మండిపడ్డారు. నాగేశ్వరరావు పనిచేసిన పత్రికలు, ఛానల్స్ అభివృద్ధి జరగలేదు అభివృద్ధిని అడ్డుకోవడానికి కులాలు, మతాలు మధ్య చిచ్చు పెట్టడానికి కొంతమంది పని చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ లారీ ప్రమాదంలో మరణించిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలను

## ప్రభుత్వం ఆదుకోవాలని ధర్నా




**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మే 16న కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామ ఉపాధి హామీ కూలీలను టిప్పర్ లారీ డీకొట్టిన ప్రమాదంలో మరణించిన అయిదు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 25లక్షలు చొప్పున ఎక్స్ గ్రేసీయా ఇవ్వాలని, తీవ్రంగా గాయపడి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వారికి 10లక్షలు ఇవ్వాలని, కుటుంబంలో చదువుకున్న ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. చదువుతున్న పిల్లల బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని, ఉద్యోగ అర్హత లేని వారికి ఒక ఎకరం సాగు భూమి ఇవ్వాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి అనంతరం కాకినాడ కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్'కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఘటన జరిగి వారం రోజులు కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఏ విధమైన ఆర్థిక సహాయం అందించలేదని, కేవలం వారికి వచ్చే ఇన్సూరెన్స్ డబ్బులకు సంబంధించి మాత్రమే హామీ వచ్చిందన్నారు. ఈ మధ్యకాలంలో అనేక ప్రమాదాలలో చనిపోయిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 20 నుంచి 30 లక్షల రూపాయల ఎక్స్ గ్రేసియా ఇచ్చిందని చీడిగ ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు కూడా 25 లక్షల రూపాయల చొప్పున ఎక్స్ గ్రేసీయా ఇవ్వాలని విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిందిర ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మృతులకు నాలుగు లక్షల రూపాయలు చొప్పున అందిస్తామని చెప్పారని అన్నారు. ఈ 25 లక్షల ఎక్స్ గ్రేషియా గురించి కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్ శ్రీనివాస్, సిఐటియు నాయకులు సిహెచ్ అజయ్ కుమార్, టి రాజా, ప్రజా సంఘాల నాయకులు జిత్తుగ శ్రీనివాస్, కే వీరబాబు, వాసంశెట్టి చంద్రరావు, యుఎస్ఎన్ రెడ్డి, ఎ ఏడుకొండలు, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.


దళిత మేధావి డాక్టర్ సుధాకర్‌పై

## ఆనాడు వైసిపి అరాచకం

మాస్క్ అడిగితే వేధించి చంపారు : ఎమ్మెల్యే వనమాడి కొండబాబు




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కరోనా సమయంలో ఆసుపత్రిలో సరైన ఎన్-95 మాస్కులు, రక్షణ పరికరాలు లేవని అనాడు వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు డాక్టర్ సుధాకర్ గారిని నడిరోడ్డుపై రెక్కలు విరిచి కట్టి, కొట్టి, నానా చిత్రహింసలు పెట్టి, ఒక సామాన్య వైద్యుడిని వెంటాడి వేధించి చివరికి అంతమొందించారని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు విమర్శించారు. దళిత మేధావి డాక్టర్ సుధాకర్ వర్ధంతి సందర్భంగా గురువారం జగన్నాథపురం, అన్నమ్మ గాటి సెంటర్ నందు నగర ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు డాక్టర్ సుధాకర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన ఎన్-95 మాస్కులు, రక్షణ పరికరాలు లేవని గత వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించనందుకు, నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన అనస్థీషియా డాక్టర్ సుధాకర్ 2021 మే 21వ తేదీన గుండెపోటుతో మరణించాలే గత వైసిపి పాలకులు చిత్రహింసలకు గురి చేశారని, వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు డాక్టర్ సుధాకర్ ను నడిరోడ్డుపై ఈడ్చుకెల్లి, కొట్టి తీవ్ర మానసిక క్షోభకు గురి చేయడంతో డాక్టర్ సుధాకర్ మానసిక శోభకు గుండెపోటుతో హఠాన్మరణం చెందారని, వైసీపీ నిరంకుశ సర్కారుపై పోరాడిన సుధాకర్‌కి నేడు నివాళులు అర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు అంబటి సత్యనారాయణ (చిన్న), ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, పలివెల రవి అనంత కుమార్, సికోటి అప్పలకొండ, పెదపూడి కుమార్, పిల్లి శివకుమార్, బంగారు సత్యనారాయణ, పోలిపల్లి జగన్, ఏడిద శ్రీను, బత్తిన ఉమా, బొడ్డుపల్లి నాని, ముడే రాజబాబు, ముర్తండ నాగేశ్వరరావు, నాగేంద్ర కుమార్, కంది కృప, పాలిక నాని, మేడిశెట్టి చిన్ని, గడ్డం పూర్ణ చంద్రశేఖర్, సంఘాని నాగూర్, తదితరులు పాల్గొన్నారు.



భానుడి భగభగలకు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో ప్రస్తుతం తీవ్ర ఉష్ణోగ్రతలతో కొనసాగుతున్న వేసవి హీట్ వేవ్ పరిస్థితుల నేపధ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. గురువారం ఆయన మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో నెలకొంటున్న అధిక ఉష్ణోగ్రతలు, వడగాడుపు వాతావరణ పరిస్థితుల్లో ప్రజల రక్షణ చేపట్టవలసిన చర్యలను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో తాళ్లరేవు, కాజులూరు, కరప, కాకినాడ రూరల్, పెదపూడి మండలాల్లో 43 నుండి 45 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, వాతావరణ శాఖ సూచన ప్రకారం ఈ పరిస్థితి మరో వారం రోజులపాటు కొనసాగే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ విపరీత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఉదయం 10 గంటలకు ముందు సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే



నిర్వహించాలని పని ప్రదేశంలో శ్రామికులు సేద తీరేందుకు టెంట్లు, త్రాగునీరు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలెవరూ ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, అనారోగ్యాలతో బాధపడేవారు తప్పనిసరైతే తప్ప ఎండవేళ ఆరు బయట సంచరించవద్దని సూచించాలని, అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల నుండి రక్షణకు చేపట్టవలసిన జాగ్రత్తలను అందరికీ వివరించాలని ఆదేశించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లోను, ఏఎన్ఎంల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, ఎవరైనా వడదెబ్బకు గురైతే తక్షణ వైద్య సహాయం అందించేందుకు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సదా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బస్ స్టాండులలోను గ్రామాలు వార్డుల ముఖ్య కూడళ్లలో వితరణ శీల దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. బస్ స్టాపుల వద్ద ప్రజలకు నీడ కల్పించే ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఏ ఆవాసంలోనూ ప్రజలకు త్రాగునీటి సరఫరా ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అవసరమైతే వాహనాల ద్వారా సరఫరా చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే పశువులకు త్రాగు నీటి ఎద్దడి లేకుండా నీటి తొట్టెలు ఎప్పటిప్పుడు నింపాలని తెలిపారు. వర్షాలు మొదలై వాతావరణం చల్లబడే వరకూ అధికారులందరూ సమన్వయంతో రక్షణ, సహాయ చర్యలను చేపట్టి వేసవి అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల వల్ల జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు.

## పగడ్బందీగా పరీక్షలు


డీఆర్వో డాక్టర్ టి.తిప్పేనాయక్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** మే నెల 25 నుంచి జూన్ 04 వరకు జరగనున్న పదో తరగతి అడ్వాన్సు సప్లిమెంటరీ, ఓపెన్ స్కూల్ పరీక్షలు పదో తరగతి, ఇంటర్మీడియట్ పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్ పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు నిర్వహణపై డీఆర్వో తిప్పే నాయక్.. వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 25 నుంచి జూన్ 04 వరకు జరగనున్నాయన్నారు. జిల్లాలో పదోతరగతి అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలకు 22 పరీక్ష కేంద్రాల్లో 4,405 మంది విద్యార్థులు, ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు 08 పరీక్షా కేంద్రాల్లో 1,386 మంది విద్యార్థులు, ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ కు సంబంధించి 11 పరీక్ష కేంద్రాల్లో 3,119 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ప్రతిరోజు ఉదయం 09:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:45 వరకు జరిగే ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా జరిగేందుకు అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ఎవరు ఎండ దెబ్బకు గురికాకుండా చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు, విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు, పరీక్ష కేంద్రాల పరిధిలో తగినన్ని ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. సమావేశంలో కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.జగన్నాథం, ఎడీసీఈబీ సెక్రటరీ వెంకటరావు, అసిస్టెంట్ కమీషనర్ ఫర్ ఎగ్జామినేషన్, పోస్టల్, ఆర్టీసీ వైద్య ఆరోగ్యం ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా

- ఇంఛార్జి ఉమ్మిడి వెంకటరావు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రతిపాడు నియోజకవర్గంలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి ఉమ్మిడి వెంకటరావు పేర్కొన్నారు. నియోజక వర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. ఆయన నియోజకవర్గ పార్టీ ఇంఛార్జిగా తాజాగా నియమితులైన నేపథ్యంలో మండల కేంద్రం ప్రతిపాడులో పీసీసీ నాయకులు ధరణాలకోట శ్రీను అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించిన స్థానిక పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపాడు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, యువజన నాయకులను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానని తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయి నాయకులను కలుపుకొని పార్టీకి మంచి గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. రానున్న రోజుల్లో రాహుల్ గాంధీని దేశ ప్రధాన మంత్రిగా, డాక్టర్ ఎం.ఎం.పల్లంరాజును కాకినాడ ఎంపీగా గెలిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముందుగా స్థానిక అంబేద్కర్ కళా మందిరంలో డాక్టర్ బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలను వేసిన నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కూడా పూల మాలలను వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమాల్లో కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మాదేపల్లి సత్యానందం (చిట్టిబాబు), పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కొల్లు వీర గణేష్, జిల్లా బీసీ సెల్ చైర్మన్ మొయ్యేటి ప్రకాశరావు, నాయకులు కొప్పన కోటేశ్వరరావు, ఊటా శ్రీను, యనుమల రాజా, శ్రీనివాస్, దొంతంశెట్టి చంద్రశేఖర్, రామకుర్తి సూర్యనారాయణ, యువజన నాయకులు ఎన్ఎన్ రవి, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 23న విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఈనెల 23న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తు జిల్లాలో దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ప్రతి నెలా మూడవ శనివారం దివ్యాంగుల సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 23న కాకినాడ కలెక్టరేట్ ప్రజావాణి హాలులో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ద్వారా పెన్షన్లు, సహాయ పరికరాలు మంజూరు, విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాలు ఇతర శాఖాపరమైన విషయాలకు సంబంధించి తమ వినతిపత్రాలను, దరఖాస్తులను, అర్జీలను నేరుగా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. కావున కాకినాడ జిల్లాలో గల దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు


## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతుల సంక్షేమమే కూటమి ప్రభత్వ లక్ష్యమని రామచంద్రపురం నియోజకవర్గ కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కాజులూరు మండలం కోలంక గ్రామంలో రూ. 2కోట్ల 90 లక్షల వ్యయంతో చేపట్టానున్న కాలువ పూడిక తీత పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ పనుల్లో భాగంగా ఇంజరం నార్త్ కాలువలో 3 కిలోమీటర్లు, మసకపల్లి కాలువలో 4 కిలోమీటర్ల మేర పూడిక తీత పనులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా సాగునీరు సాఫీగా అందడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సత్యం తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముందస్తు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. వంటకాలువలు, పూడికలు తొలగించడం ద్వారా సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు తమకు అనుకూలమైన చోట ధాన్యం విక్రయించుకునే అవకాశం కల్పించామని తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల కోసం ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని వాసంశెట్టి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు ఇరిగేషన్ ఏఈఈ అనూష, అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం, కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు, డీసీలు లకాని కృష్ణ చైతన్య, విజయ గోపాల్ రాజు, పేపకాయల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలు అర్థరహితం



నిరాధార ఆరోపణలు సహించం, వ్యాఖ్యలు వెనక్కి తీసుకోండి : ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ డిమాండ్

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, ఉప ముఖ్యమంత్రి పవన్‌ల మధ్య జరిగిన భేటీలో మాజీ ముఖ్యమంత్రి జగన్ అరెస్టుపై చర్చించినట్లు ఇటీవల ఒక టీవీ ఛానల్ చర్చలో ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యానించడం అర్ధరహితమని, బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు . గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి విషయం పైన లోతైన విశ్లేషణ, కచ్చితమైన సమాచారంతో మాట్లాడే నాగేశ్వర్ అందుకు భిన్నంగా ఈసారి ఫక్తు రాజకీయ నాయకుడిగా దిగజారి అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం విచారకరమన్నారు. తమ అధినేత పవన్ కళ్యాణ్ నిరంతరం జనసేన పార్టీ అభివృద్ధి, పార్టీ కార్యకర్తలు, వీర మహిళల సంక్షేమం కోసమే ఆలోచిస్తారని, అలాగే ఢిల్లీలో ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసినప్పుడు పార్టీ ఎంపీలు ఆయన వెంట ఉంటామని, తమ భేటీ లో పవన్ కళ్యాణ్ రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి పనులకు నిధుల కోసం మాత్రమే చర్చిస్తారు తప్ప ఇతర విషయాలు ఎప్పుడూ చర్చించిన దాఖలాలు లేవన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఇప్పటికైనా వాస్తవాలు గుర్తేరిగి ఆధారాలుంటే నిరూపించాలని, లేనిపక్షంలో చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# దళితులపై అరాచక పాలన సాగించిన జగన్

**ఎమ్మెల్సీ అనంతబాబును పార్టీ నుండి సస్పెండ్ చేసి, ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలి**

**డాక్టర్ సుధాకర్‌కు నివాళులర్పించిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు : టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దళితులపై హత్యలు అత్యాచారాలు చేయించిన గత పాలనలో జగన్ సాగింది, దళితుల మేనమామను అని చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి దళితులపై అరాచక పాలన సాగించాడని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ విమర్శించారు. గురువారం రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జగన్మోహన్ రెడ్డి పాలనలో చిత్రం గుర్రై, మానసిక క్షోభ తో మృతి చెందిన డాక్టర్ సుధాకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగినందుకు అప్పటి జగన్ ప్రభుత్వం ఆయనను చిత్ర హింసలు పెట్టి వేధింపులకు గురి చేసి, గజదొంగ వలె చేతులు వెనక్కి కట్టి ఆటోలో పోలీస్ స్టేషన్ కు తరలించారని అన్నారు. డాక్టర్ సుధాకర్ ఏ విధమైన నేరం చేయకుండానే పోలీస్ స్టేషన్ కు పిలిపించి మానసిక క్షోభకు గురిచేసి ఆయన మృతికి కారణమయ్యారని అన్నారు. ఎమ్మెల్సీ అనంత బాబు కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య చేసి డోర్ డెలివరీ చేసిన అనంత బాబు ఏ విధమైన శిక్ష అనుభవిం చకుండానే బయట తిరుగుతున్నాడని అన్నారు. అలాగే జడ్జ్ రామకృష్ణ విషయం లో ఇబ్బందులకు గురి చేశారని వివరిం చారు. జగన్ పాలనలో దళిత మహిళల పై హత్యలు, అత్యాచారాలు, అనేక సంఘటనలు జరిగాయని అన్నారు. ఇప్ప టికైనా జగన్ బుద్ధి తెచ్చుకొని ఎమ్మెల్సీ అనంత బాబు ను పార్టీ నుండి సస్పెండ్ చేసి, ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగిం చాలని డిమాండ్ చేశారు. దళితులపై హత్యలు అత్యాచారాలు చేయించిన జగన్‌ను తిరిగి అధికారంలోకి రాకుండా దళిత సమాజం కట్టడి చేయించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు జరుగుతున్నాయని హర్షం వ్యక్తంచేశారు. హిత కారిణి సమాజం బోర్డు చైర్మన్ డాక్టర్ యాళ్ళ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ కోవిడ్ సమయం లో డాక్టర్లు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను కాపాడారని అన్నారు. డాక్టర్ల ప్రాణాలతో ఉంటేనే ప్రజలను రక్షించే అవకాశం ఉందని వివరించారు. కోవిడ్ సమయంలో ఎన్95 మాస్క్ కావాలని న్యాయమైన కోర్కెను కోరిన డాక్టర్ సుధాకర్‌ను జగన్ ప్రభుత్వం మానసికం చిత్రహింసలకు గురిచేసి ఆయన మృతికి కారణం అయ్యారని అన్నారు. జగన్ పాలనలో దళితులు పట్ల అరాచకాలు ఎక్కువగా జరిగాయని అన్నారు. జగన్ పాలనపై ప్రజలు దృష్టి పెట్టి ఆయన అరాచకాలు అడ్డుకోవాలంటే ఆయనను అధికారంలో రాకుండా చూడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కూటమి పాలన లో దళితులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చాపల రాజు, దారా యేసురత్నం, కోరుకొండ చిరంజీవి, హర్షవర్ధన్, కారంగి వీర్రాజు, బంగారు నాగేశ్వరరావు, రాజ్ కుమార్, మందపల్లి శేఖర్, ఉడమల నాగేశ్వరరావు, కొమ్మ శ్రీనివాస్, బొర్రా చిన్ని, తురకల నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల అభివృద్ధి, రోడ్ల విస్తరణకు

# భూసేకరణ చెయ్యండి : బత్తుల

**హౌసింగ్, పురుషోత్తపట్నం బాధితులకు పరిహారం ఇవ్వండి**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తగిన నిధులు, భూసేకరణ త్వరితగతిన చేయాలని రాజానగరం శాసనసభ్యులు బలరామకృష్ణ జిల్లా జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ కి పలు పెండింగ్ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గురువారం శాసన సభ్యులు బలరామకృష్ణ, జెసి మేఘ స్వరూప్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లో మౌలిక వసతుల కల్పన, ఆలయాలు, రోడ్ల అభివృద్ధి, రైతులకు అందాల్సిన పరిహారాలపై మేఘ స్వరూప్ తో చర్చించారు. కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయరోడ్డు అభివృద్ధికి తక్షణమే సర్వే నిర్వహించి, ఆక్రమణలను తొలగించాలన్నారు. పుష్కరాల దృష్ట్యా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని, కనుపూరు కొండపై ఉన్న మల్లిఖార్జున స్వామి ఆలయా అభివృద్ధి, కోరుకొండ శ్రీ రంగనాథస్వామి ఆలయ పునః నిర్మాణానికి నిధులు కేటాయించాల న్నారు. శ్రీరామ్ పురం - పోలీసు క్వార్టర్స్ రోడ్డు అభివృద్ధికి కొంత అటవీభూమి భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోయిన రైతుల పరిహారం పెండింగ్‌లో ఉందని, ఆ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ సమస్యలపై జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ సానుకూలంగా స్పందించినట్లు బత్తుల తెలిపారు.

### గాడాల అక్రమ లేఅవుట్‌లలో

# రోడ్ల నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోండి

**మాజీ ఉపసర్పంచ్ శ్యామలరావు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని గాడాలలో షిరిడి నగర్ లేఅవుట్ పక్కన నూతనంగా ఏర్పాటుచేస్తున్న లేఅవుట్‌కు సంబంధించి అక్రమ రోడ్ల నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని గాడాల మాజీ ఉప సర్పంచ్ సుతాపల్లి శ్యామలరావు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. గ్రామంలోని అక్రమ లేఅవుట్ రోడ్ల నిర్మాణంపై జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. గురువారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి నకళ్ళను పాత్రికేయులకు అందజేశారు. గతంలో 27.65 ఎకరాలలో ఏర్పాటుచేసిన షిరిడి నగర్ లేఅవుట్ పక్కన, సతీష్ తదితరులు అక్రమరోడ్లు నిర్మాణలు చేస్తున్నట్లు సంబంధిత అధికారులకు శ్యామలరావు ఫిర్యాదు చేశానన్నారు. రోడ్డు నుండి రోడ్డుకు మార్గం వదలమని అడిగితే తన పట్ల సతీష్ దురుసుగా మాట్లాడాడని ఆవేదన వ్యక్తం చేశారు. సతీష్ ఏర్పాటు చేస్తున్నటువంటి లేఅవుట్ కు పంచాయతీ కార్యదర్శి ఏ విధంగా అనుమతి ఇచ్చారో బహిర్గతం చేయాలన్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశానని, అవసరమైతే కోర్టుకు వెళ్లడానికి తనతో పాటు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

# జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డి.నరసింహ కిషోర్, ఐపీఎస్‌ను రాజానగరం నియోజకవర్గ శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ మర్యాదపూర్వకంగా కలుసుకు న్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యా లయంలో జరిగిన ఈ సమా వేశంలో నియోజకవర్గ పరిధిలోని పలు కీలకాంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా రాజానగరం నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడం, ప్రజల భద్రతకు పెద్దపీట వేయడంపై చర్చించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్యే ఎస్పీని కోరారు. దీనిపై ఎస్పీ సానుకూలంగా స్పందిస్తూ ఇప్పటికే ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే సామాన్య ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా చర్చించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పోలీస్ శాఖకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ ముందుంటుందని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ నరసింహ కిషోర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురు పోలీస్ అధికారులు, జనసేన, కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### పేదల సంక్షేమం, ఆయన నిర్ణయాలు

# నేటికీ రాజీవ్ గాంధీ ఆదర్శం

**డాక్టర్ టి.కె విశ్వేశ్వర్ రెడ్డి, బాలేపల్లి మురళీధర్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదల సంక్షేమం, ఆయన నిర్ణయాలు నేటికీ రాజీవ్ గాంధీ ఆదర్శం, దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.కె విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక సీతంపేట రాజీవ్ గాంధీ పార్క్ (వాటర్ ట్యాంకులు)వద్ద భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ టి.కె.విశ్వేశ్వర్ రెడ్డి, బాలేపల్లి మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధ మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న టి.కె. విశ్వేశ్వర్ రెడ్డి, బాలేపల్లి మురళి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి, యువతకు సాంకేతిక విప్లవానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్టిన్ లూథర్, దేవత్ సుధాకర్, వీరభద్రరావు, బర్రె సుబ్రహ్మణ్యం, కిషోర్ జైన్, తాడి సూరిబాబు, మోతా శారద తదితరులు పాల్గొన్నారు.


### అత్యధిక ఉష్ణోగ్రతలు దృష్ట్యా

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసిల్దార్ ఏ.శ్రీనివాస్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలలో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉన్నదని జాతీయ మరియు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థల సూచనల మేరకు మరియు అత్యధికముగా నమోదు అవుతున్న (45శీఎ) ఉష్ణోగ్రతల దృష్ట్యా సీతానగరం మండలంలోని ప్రజలందరూ తప్పనిసరి లేదా అత్యవసర పరిస్థితుల్లో తప్ప మధ్యాహ్నం సమయంలో బయట సంచరించవద్దని, ముఖ్యంగా వృద్ధులు మరియు పిల్లలను వెంటబెట్టుకుని మధ్యాహ్న సమయంలో ఎటువంటి ప్రయాణాలు లేదా బయట సంచరించడం చేయవద్దని కోరుతూ సదరు విషయమై గ్రామాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీతానగరం తాసిల్దార్ ఏ శ్రీనివాస్ తెలిపారు.

# జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జగదీష్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్సీపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం శాసనసభ్యులు జక్కంపూడి రాజాతో రాజానగరం నియోజకవర్గ వైఎస్ఆర్సీపి ఐటీ విభాగం అధ్యక్షులు అడబాల జగదీష్ మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం జగన్మోహన్ రెడ్డిని కలిసి అనంతరం జగదీష్ తనకు సోదరసమానుడని నియోజకవర్గ కార్యక్రమాల్లో చేదోడు వాదోడుగా ఉంటు, పార్టీ కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషిస్తాడని జక్కంపూడి, జగన్ కి పరిచయం చేశారు. కమిటీల ఏర్పాటు, డిజిటిలైజెషన్ పై జగన్ నియోజకవర్గంపై ఆరా తీశారన్నారు. కమిటీల డిజిటిలైజెషన్ ప్రక్రియలో జగదీష్ చక్కటి సహకారం అందిస్తున్నట్లు జగన్ కు తెలిపారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారం లోకి వచ్చేందుకు రానున్న రోజుల్లో ఐటీ విభాగం మరింత కృషి చేయాలని జగన్ సూచించినట్లు జగదీష్ తెలిపారు.

# రాజకీయ ప్రతినిధులకు ఎస్ఐఆర్‌పై అవగాహన సమావేశం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని మండ పేట తహసీల్దార్ తేజేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట తహశీల్దార్ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం గురువారం జరిగింది. సహాయ ఓటరు నమోదు అధికారి తహశీల్దార్ పి.తేజేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఫారం-6, 7, 8 దరఖాస్తుల స్టేటస్, ఓటర్ల మ్యాపింగ్, డెమోగ్రాఫికల్ సిమిలార్ ఎంట్రీస్ డి ఎస్ సి తొలగింపు, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై చర్చించారు. ఎస్ ఐ ఆర్ షెడ్యూల్ ప్రకారం బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి అనగ్జరు- 3,4 ఫారాలు పంపిణీ చేస్తారని, ఓటరు నమోదుకు అవసరమైన వయస్సు, నివాస ధృవీకరణ పత్రాలను తహశీల్దార్ వివరించారు. అన్ని రాజకీయ పార్టీలు వెంటనే బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి, 100% ఓటరు నమోదుకు బి ఎల్ ఓ లకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ సమావేశంలో టీడీపీ టౌన్ మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, టిడిపి నాయకులు మేడపాటి రవీంద్ర రెడ్డి, ఎ సత్యనారాయణ బీజేపీ టౌన్ అధ్యక్షులు ఫణి ప్రకాష్, వైఎస్ఆర్సీపీ నాయకులు యరమాటి వెంకన్నబాబు, వాసిరెడ్డి అర్జున్, సూరంపూడి సత్య ప్రసాద్, జనసేన టౌన్ అధ్యక్షులు నామాల చంద్రరావు, కాంగ్రెస్ నాయకులు ఎం.జె.రాజ్ బాబ్, అధికారులు కె.శ్రీ రమ్య, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పి.ఎ.మెహర్ బాబా, సీనియర్ అసిస్టెంట్లు వై.శ్రీనివాస్, ఎం.పద్మనాభం, ఎన్నికల ఆపరేటర్లు హాజరయ్యారు.

# కాలేయ వ్యాధులకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రాణరక్షక చికిత్స : డాక్టర్ పార్థసారథి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రముఖ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ పార్థసారథి మీడియాతో మాట్లాడారు. కాలేయ వ్యాధులు మరియు కాలేయ వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రాణాలను రక్షించే అత్యంత కీలకమైన చికిత్స అని ఆయన తెలిపారు. ఎండ్-స్టేజ్ లివర్ సిరోసిస్, ఆకస్మిక లివర్ ఫెయిల్యూర్, కొన్ని ఎంపిక చేసిన లివర్ క్యాన్సర్ కేసులు, జన్యుపరమైన కాలేయ వ్యాధులు, అలాగే క్రానిక్ హెపటైటిస్ వల్ల వచ్చే సమస్యలలో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరం అవుతుందని వివరించారు. వైద్య చికిత్సలకు స్పందించని రోగుల్లో ఆసైటిస్ (కడుపులో నీరు చేరడం), జాండిస్, హెపాటిక్ ఎన్సెఫలోపతి వంటి తీవ్రమైన సమస్యలు కనిపించినప్పుడు లివర్ ట్రాన్స్‌ప్లాంట్ తప్పనిసరి అవుతుందని డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. ఆధునిక శస్త్రచికిత్స పద్ధతులు మరియు శస్త్రచికిత్స అనంతరం మెరుగైన వైద్య సంరక్షణ కారణంగా ప్రస్తుతం లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫలితాలు గణనీయంగా మెరుగుపడ్డాయని, ట్రాన్స్‌ప్లాంట్ అనంతరం మొదటి ఏడాదిలో 85 నుంచి 90 శాతం వరకు జీవన శాతం నమోదవుతోందని తెలిపారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, సమయానికి ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్లకు రోగులను రిఫర్ చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన చెప్పారు. ట్రాన్స్‌ప్లాంట్ అనంతరం రోగులు జీవితాంతం ఫాలోఅప్‌తో పాటు ఇమ్యూనోసప్రెసివ్ మందులు తీసుకోవాల్సి ఉంటుందని, సరైన సంరక్షణతో సాధారణ జీవితాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. అవయవ దానంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, అప్పుడే ఎక్కువ మంది రోగులకు ఈ ప్రాణరక్షక చికిత్స అందుబాటులోకి వస్తుందని డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరభద్ర, అసిస్టెంట్ మేనేజర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలి

**చెల్లుబోయిన సూర్యనారాయణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తల్లిదండ్రులు క్రీడల పట్ల పిల్లల్లో ఆసక్తిని పెంపొందించాలని, రాక్ స్టార్ ఫుట్ బాల్ క్లబ్ అధ్యక్షులు చెల్లుబోయిన సూర్య నారాయణ అన్నారు. గురువారం స్థానిక ఎస్.కే.వి.టి. కళాశాలలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ అథారిటీ, మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫుట్ బాల్ కోచింగ్ క్యాంపులో చెల్లుబోయిన సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 5 ఫుట్ బాల్ బంతులను ఆయన బహుకరించారు. అనంతరం చెల్లుబోయిన మాట్లాడుతూ రాజమహేంద్రవరం సిటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచన మేరకు ఈ ఫుట్ బాల్ లు బహుకరించడం ఆనంద దయాకమని, ఫుట్ బాల్ క్రీడను అభివృద్ధికి తన సహాయ సహకారాలు అందచేస్తామన్నారు. ఫుట్ బాల్ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్న కోచ్ బి. మణి కంఠ, అజయ్ అమరార్కర్, వినోద్, శిక్షణలో పాల్గొన్న 50 మంది చిన్నారులను, వారి తల్లితండ్రులను అయిన అభినందించారు. మరో అతిథిగా పాల్గొన్న స్పోర్ట్స్ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్ మాట్లాడుతూ విశ్వ వ్యాప్తంగా ఎక్కువ మంది ఆడే క్రీడ ఫుట్ బాల్ అనీ, మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు అవసరమని పేర్కొన్నారు. క్రీడా స్ఫూర్తితో విశిష్ట సేవలనందిస్తున్న చెల్లుబోయిన సూర్య నారాయణను అందరూ అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు సీరా గంగాధర్, ఎస్.కే.వి.టి. జి.డి కాలేజీ వ్యాయామఅధ్యాపకులు పి.ఏ. కిషోర్ బాబు, నేషనల్ ఫుట్ బాల్ క్రీడా కారులు కేలం శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ శేషగిరి లు తమ అభినందన సందేశాలను తెలియజేశారు.




## కేన్స్ వేదికపై మోడ్రన్ డ్రెస్‌లకు చెక్ పెట్టిన బ్యూటీ..!

# చేనేతతో అదరగొట్టిన అదితి



ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్న ఈ ఫోటోలలో అదితీరావు హైదరీ 'జేడ్ బై మోనికా అండ్ కరిష్మా' కలెక్షన్ నుండి సేకరించిన అద్భుతమైన షీర్ ఆర్గాంజా చీరను ధరించారు. లేత షాంపేన్ రంగుతో మెరిసిపోతున్న ఈ చీరపై చేసిన సూక్ష్మమైన ఎంబ్రాయిడరీ వర్క్, గోల్డ్ సీక్విన్స్ మరియు అద్భుతమైన సితార అలంకరణలు రాజసం ఉట్టిపడేలా చేశాయి. ఈ మోనోక్రోమటిక్ శైలికి మ్యాచ్ అయ్యేలా ఆమె అదే రంగులో ఉన్న స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను జతచేశారు. ఈ బ్లౌజ్ యొక్క మోడ్రన్ కట్ అటు సాంప్రదాయ సౌందర్యాన్ని, ఇటు ఆధునిక ట్రెండ్‌ను ఎంతో సమతుల్యంగా ఆవిష్కరించింది. అంతర్జాతీయ ఫ్యాషన్ ప్రపంచం అంతా సరికొత్త సరిహద్దులను దాటుతూ వింత వింత దుస్తులు, భారీ శైలి గౌన్ల వైపు పరుగెడుతోంది. కేన్స్ చలనచిత్ర వేడుకల రెడ్ కార్పెట్ మీద తారలు ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా అత్యంత ఆడంబరమైన, మెరిసిపోయే వెస్టన్ అవుట్‌ఫిట్స్‌తో సందడి చేస్తున్నారు. అయితే, ఈ హడావుడి మధ్య ఆ స్టార్ బ్యూటీ ఎంతో నిశ్శబ్దంగా, అత్యంత అందమైన ఒక భారతీయ సాంప్రదాయ చీరకట్టులో అడుగుపెట్టారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా కేవలం తన లుక్‌తోనే అంతర్జాతీయ ఫ్యాషన్ విశ్లేషకుల నోళ్లు మూయించారు. ప్రముఖ డిజైనర్ బ్రాండ్ 'జేడ్' రూపొందించిన వస్త్రంలో ఆమె కేన్స్ వేదికపై ఒక పర్ఫెక్ట్ రెడ్ కార్పెట్ మూమెంట్‌ను సృష్టించారు. ప్రస్తుత జనరేషన్ ఫ్యాషన్ పిచ్చికి ఒక సున్నితమైన చురకలా అనిపించిన ఆమె లుక్, ఈ సీజన్ లోనే అత్యంత ఐకానిక్ లుక్స్‌లో ఒకటిగా నిలిచింది.

**హెరిటేజ్ గోల్డ్ చోకర్..**

ఈ అందమైన చీరకట్టుకు అదనపు ఆకర్షణను తెచ్చేలా అదితీ హెవీ స్టేట్‌మెంట్ గోల్డ్ చోకర్‌ను ధరించారు. సాంప్రదాయ చిన్న చిన్న బంగారు చుక్కల డిజైన్‌తో రూపొందించిన ఈ నెక్లెస్ ఆమె కాలర్‌బోన్ వద్ద ఎంతో అందంగా కుదురుకుంది. చెవులకు కమ్మలు కానీ, చేతులకు గాజులు కానీ లేకుండా కేవలం మెడలో చోకర్ మరియు వేళ్లకు కొన్ని ప్రత్యేకమైన ఉంగరాలను మాత్రమే ధరించడం ద్వారా ఆమె తన లుక్‌ను ఎంతో హుందాగా తీర్చిదిద్దుకున్నారు. హెవీ జ్యువెలరీతో మెడ ప్రాంతాన్ని నింపేయకుండా, సింపుల్‌గా ఉంచడమే ఆమె లుక్‌కు ఒక ప్రత్యేకమైన రాయల్ వెయిట్‌ను తీసుకొచ్చింది. మేకప్ విషయానికి వస్తే, అదితీ ఎల్లప్పుడూ ఇష్టపడే తన సిగ్నేచర్ నేచురల్ గ్లో స్టైల్‌ను ఎంచుకున్నారు. మెరిసే ఫౌండేషన్ బేస్, లేత రంగు ఐషాడో, రోజీ చీక్స్ మరియు మస్కారాతో కూడిన కళ్లు ఆమె అందాన్ని రెట్టింపు చేశాయి. అయితే, ఈ మోనోటోన్ లుక్‌ను బ్రేక్ చేస్తూ ఆమె ధరించిన బ్రైట్ రెడ్ కలర్ లిప్‌స్టిక్ ఈ మొత్తం ఆహార్యానికే ప్రధాన కేంద్ర బిందువుగా నిలిచింది. మెస్సీ లో పోనీటైల్ (జుట్టు ముడి) వేసుకుని, ముఖంపైకి కొన్ని జుట్టు పాయలను వదిలేసిన విధానం ఆమె ముఖ సౌందర్యాన్ని మరింత ఎలివేట్ చేసింది.

**'లెస్ ఈజ్ మోర్'..**

కేన్స్ రెడ్ కార్పెట్ నిరంతరం భారీ మరియు ఫ్లాషీ డిజైన్ల వైపు పరుగెడుతున్న తరుణంలో, ఆమె ఎంతో ప్రశాంతంగా, మన దేశీయ సాంప్రదాయ సౌందర్యాన్ని ఎంతో నియంత్రణతో ప్రదర్శించిన తీరు అద్భుతమనే చెప్పాలి. మితిమీరిన కోర్సెట్ మరియు కేప్ ట్రెండ్స్‌తో బోర్ కొట్టించేస్తున్న ఫ్యాషన్ ప్రపంచానికి ఆమె ఒక కొత్త దారిని చూపించారు. ఫ్యాషన్ అంటే కేవలం ఖరీదైన, వింతైన బట్టలు వేసుకోవడం కాదు, తక్కువ వస్తువులతోనే అత్యంత ప్రభావవంతంగా కనిపించడమే అని ఆమె నిరూపించారు. విదేశీ గడ్డపై మన భారతీయతను, చేనేత వస్త్రాల గొప్పతనాన్ని ఇంతటి ఘనంగా చాటిచెప్పిన ఈ నటి అంకితభావం నిజంగా ప్రశంసనీయం. తన సహజ సిద్ధమైన రాజసం, ఆత్మవిశ్వాసంతో ఆమె కేన్స్ వేదికపై ఒక సరికొత్త విప్లవాన్ని సృష్టించారు. ఈ ఎడ్జీ లుక్ సోషల్ మీడియాలో ఫ్యాషన్ ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

## రెహమాన్ వర్క్‌నే

# తక్కువ అంచనా వేస్తున్నారా?

### బుచ్చిబాబు సాలిడ్ క్లారిటీ!







ఇప్పుడు మన టాలీవుడ్ నుంచి రాబోతున్న అవైటెడ్ చిత్రమే "పెద్ది". మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా హీరోయిన్ జాన్వీ కపూర్ లతో దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ఈ సినిమా ప్రస్తుతం నాన్ స్టాప్ ప్రమోషన్స్ చేసుకుంటుంది. అయితే ఒక హార్డ్ హిట్టింగ్ ఎమోషనల్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రం నుంచి ఇటీవల వచ్చిన ట్రైలర్ కి కొంచెం మిక్స్డ్ రెస్పాన్స్ అది కూడా కేవలం ఓ సెక్షన్ ఆఫ్ ఆడియెన్స్ నుంచి వచ్చింది. ఇందులో చాలామంది లెజెండరీ సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ వర్క్ పైనే వంకలు పెట్టారు. దీంతో రెహమాన్ స్కోర్ ఇంపాక్ట్ కలిగించలేదు అని మాకు డైలాగ్స్ కంటే బీ జి ఎం మాత్రమే ఎక్కువ కావాలి అనుకునే బ్యాచ్ బాగా డిజప్పాయింట్ అయ్యిపోయారు. అయితే వీరికే క్లారిటీ నేరుగా బుచ్చిబాబు నుంచి వచ్చింది. లేటెస్ట్ ఇంటర్వ్యూలో తాను సినిమా స్కోర్ కోసం ప్రత్యేకంగా మాట్లాడాడు. రెహమాన్ గారు పెద్ది కి ఎక్సలెంట్ బ్యాక్గ్రౌండ్ స్కోర్ ని అందించారు. అని కొన్ని సీన్స్ అయితే తన స్కోర్ తో నెక్స్ట్ లెవెల్ కి వెళ్లాయని తెలిపాడు. దీనిని ట్వీట్ గా కూడా పోస్ట్ చేద్దామనుకున్నా కానీ ఆగానని బుచ్చిబాబు చెప్పడం జరిగింది. సో రెహమాన్ వర్క్ ని తక్కువ అంచనా వేసిన వారు అంత జూన్ 4న సైలెంట్ అవ్వాల్సిందే.

## ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ బౌలింగ్.. 'పెద్ది' భామ బ్యాటింగ్..

# జాన్వీ దెబ్బకు పాపం ఫ్యాన్ కన్ను..!






ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో 'పెద్ది' హవా నడుస్తోంది. మరోవైపు ఐపీఎల్ కూడా దాదాపు తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్, పెద్ది హీరోయిన్ జాన్వీ కపూర్ సరదాగా క్రికెట్ ఆడారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. క్రికెట్, సినిమా.. ఈ రెండు రంగాలకు ఇండియాలో ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తాజాగా ఈ రెండు రంగాలకు చెందిన ఇద్దరు స్టార్స్ ఒకే వేదికపై సందడి చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హైదరాబాద్‌లో జరిగిన ఓ ఫ్యాన్ ఈవెంట్‌లో కలుసుకున్నారు. ఎప్పుడూ మైదానంలో తన ఫాస్ట్ బౌలింగ్‌తో బ్యాటర్లను భయపెట్టే కమిన్స్.. ఇక్కడ మాత్రం తన సీరియస్‌నెస్‌ను పక్కనపెట్టి జాన్వీతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ ఫ్యాన్స్‌ను ఫుల్ ఎంటర్‌టైన్ చేశాడు. హైదరాబాద్‌లోని ఖాఫీ ముఖ్రిశ్రీవేదికగా జరిగిన ఈ ఈవెంట్‌లో ఓ ఆసక్తికర ఘట్టం చోటు చేసుకుంది. ఫ్యాన్స్‌తో ఇంటరాక్ట్ అయ్యేందుకు స్టేజ్‌పై ఏర్పాటు చేసిన చిన్న క్రికెట్ సెటప్‌లో 'పెద్ది' మూవీ స్టార్ జాన్వీ కపూర్ బ్యాట్ పట్టుకోగా, కమిన్స్ బౌలింగ్ చేశాడు. ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ సరదాగా వేసిన బంతిని జాన్వీ కాస్త ముందుకు వచ్చి బలంగా షాట్ ఆడింది. అయితే ఎవరూ ఊహించని విధంగా ఆ బంతి నేరుగా వెళ్లి అక్కడే ఉన్న ప్రేక్షకుల్లోకి దూసుకెళ్లింది. సరిగ్గా అదే సమయంలో స్టేజ్ కింద ఓ అభిమాని తన మొబైల్‌లో ఈ ఫన్నీ దృశ్యాలను రికార్డ్ చేస్తున్నాడు. జాన్వీ కొట్టిన బంతి నేరుగా వెళ్లి ఆ ఫ్యాన్ ఫోన్‌కి తగలడంతో ఒక్కసారిగా అంతా షాక్ అయ్యారు. ఈ అనుకోని సంఘటనతో స్టేజ్ మీద ఉన్న జాన్వీ కూడా కంగుతింది. ఆ తర్వాత క్షణాల్లోనే అక్కడి వాతావరణం అంతా నవ్వులు, కేకలతో నిండిపోయింది. ఈ యాక్సిడెంటల్ షాట్, ఆ వెంటనే జాన్వీ ఇచ్చిన రియాక్షన్‌కు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. ఈ క్యూట్ అండ్ షాకింగ్ ఇన్సిడెంట్ తర్వాత జాన్వీ కపూర్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించింది. బంతి తగిలిన అభిమానికి క్షమాపణలు చెబుతూ ఓ పోస్ట్ పెట్టింది. "నేను కొట్టిన బంతి ఎవరి కంటికైతే తగిలిందో వాళ్ళకి సారీ.. క్రికెట్ ఆడేటప్పుడు నా బ్యాలెన్స్ ఇంకా పూర్తిగా సెట్ కాలేదు, కానీ ఎప్పటికీ నేను #newbalance బేబీనే" అంటూ సరదాగా రాసుకొచ్చింది. ఈ పోస్ట్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' సినిమా కోసం సుమారు 150 రోజుల పాటు కఠినమైన క్రికెట్ శిక్షణ తీసుకుంది జాన్వీ కపూర్. అందుకే ఈమెకు క్రికెట్‌లో మంచి టాలెంట్ ఉంది. కోచ్ అభిషేక్ నాయర్ పర్యవేక్షణలో ప్రొఫెషనల్ క్రికెటర్‌లా బ్యాటింగ్, బౌలింగ్ నైపుణ్యాలు నేర్చుకుంది ఈ బ్యూటీ. ఈ ప్రాక్టీస్ సమయంలో జాన్వీకి చాలా దెబ్బలు కూడా తగిలాయి. ఆ ప్రాక్టీస్ ఇప్పుడిలా పనికొచ్చింది. కమిన్స్, జాన్వీ కలిసిన ఈ అరుదైన క్రికెట్-సినిమా క్రాస్‌ఓవర్ మూమెంట్ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. సినిమా వాళ్లను చూడటానికి వచ్చిన అభిమానులకు స్టార్ క్రికెటర్ కూడా తోడవడంతో ఈవెంట్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. జాన్వీ ఆడిన పవర్‌ఫుల్ షాట్‌పై, పాపం వీడియో తీసుకుంటూ బంతి బారిన పడ్డ ఆ అభిమానిపై నెటిజన్లు రకరకాల మీమ్స్, జోక్స్ క్రియేట్ చేస్తున్నారు. ఏదేమైనా.. రీసెంట్ టైమ్స్‌లో జరిగిన అత్యంత ఫన్నీ అండ్ ఎంటర్‌టైనింగ్ సెలబ్రిటీ ఈవెంట్‌గా ఇది నిలిచిపోయింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. పెద్ది సినిమాలో కూడా క్రికెట్ నేపథ్యం ఉంది. మే 22న ఉప్పల్ స్టేడియంలో జరగబోయే SRH Vs RCB మ్యాచ్‌లో పెద్ది సినిమా ప్రమోషనల్ యాక్టివిటీ కూడా ఉంది.

# ప్లేఆఫ్స్ లెక్కలు తేలే లాస్ట్ చాన్స్..

### టాస్ గెలిచిన బౌలింగ్ ఎంచుకున్న చెన్నై





శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ లోని గుజరాత్ టైటాన్స్ జట్టు ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు అధికారికంగా క్వాలిఫై అయిపోయింది. ఇప్పటివరకు ఆడిన 13 మ్యాచ్‌లలో 8 విజయాలతో 16 పాయింట్లు సాధించి టేబుల్‌లో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఐపీఎల్ 2026లో లీగ్ స్టేజ్ ముగింపు దశకు చేరిన వేళ.. గురువారం రాత్రి ఒక హై-వోల్టేజ్ పోరుకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికైంది. ఐపీఎల్ 66వ లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ చెన్నై సూపర్ కింగ్స్ (CSK) జట్లు తలపడుతున్నాయి. ఈ కీలక పోరులో టాస్ గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మొదట ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్‌ను మొదట బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. రెండు జట్లకు ఇదే చివరి లీగ్ మ్యాచ్ కావడంతో లీగ్‌లో తమ స్థానాలను పదిలం చేసుకోవడానికి సర్వశక్తులూ ఒడ్డనున్నాయి. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్ జట్టు ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు అధికారికంగా క్వాలిఫై అయిపోయింది. ఇప్పటివరకు ఆడిన 13 మ్యాచ్‌లలో 8 విజయాలతో 16 పాయింట్లు సాధించి టేబుల్‌లో రెండో స్థానంలో కొనసాగుతోంది. అయితే, క్వాలిఫైయర్-1 ఆడి నేరుగా ఫైనల్‌కు వెళ్లేందుకు వీలుగా పాయింట్ల పట్టికలో టాప్-2 స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలంటే గుజరాత్‌కు ఈ మ్యాచ్‌లో గెలవడం చాలా అవసరం. సొంత మైదానంలో జరుగుతున్న మ్యాచ్ కావడం, జోస్ బట్లర్, సాయి సుదర్శన్ వంటి పవర్‌ఫుల్ ప్లేయర్స్ ఫామ్‌లో ఉండటం గిల్ సేనకు కొండంత బలాన్ని ఇస్తోంది. మరోవైపు, రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారింది. వరుసగా గత రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో సీఎస్కే నేరుగా ప్లేఆఫ్స్ చేరే సువర్ణావకాశాన్ని చేజేతులా పాడుచేసుకుంది. ప్రస్తుతం 13 మ్యాచ్‌లలో కేవలం 6 విజయాలు, 7 ఓటములతో ఉన్న చెన్నై.. ఈ మ్యాచ్‌లో భారీ రన్‌రేట్‌తో గెలిచినా కూడా ప్లేఆఫ్స్ బెర్త్ కోసం ఇతర జట్ల గెలుపోటములపై, నెట్ రన్‌రేట్ సమీకరణాలపై పూర్తిగా ఆధారపడాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ మ్యాచ్ ఓడిపోతే చెన్నై జట్టు ఐపీఎల్ 2026 టోర్నీ నుంచి అధికారికంగా నిష్క్రమించాల్సి వస్తుంది.

**రెండు జట్ల ప్లేయింగ్ ఎలెవన్ ఇవే:**

టాస్ ముగిసిన తర్వాత ఇరు జట్ల కెప్టెన్లు తమ తుది జట్లను ప్రకటించారు. సంజు శాంసన్, జోస్ బట్లర్ వంటి స్టార్ల ఎంట్రీతో ఇరు జట్లు బలంగా కనిపిస్తున్నాయి.

**చెన్నై సూపర్ కింగ్స్:** సంజు శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఉర్విల్ పటేల్, డెవాల్డ్ బ్రెవిస్, శివమ్ దూబే, మాథ్యూ షార్ట్, అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్, స్పెన్సర్ జాన్సన్, ముఖేష్ చౌదరి, గుర్జప్నీత్ సింగ్.

**గుజరాత్ టైటాన్స్:** సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), నిశాంత్ సింధు, వాషింగ్టన్ సుందర్, జేసన్ హోల్డర్, రషీద్ ఖాన్, రాహుల్ తెవాటియా, కగిసో రబాడ, అర్షద్ ఖాన్, మహ్మద్ సిరాజ్.

**పరుగుల వరద ఖాయం**

నరేంద్ర మోదీ స్టేడియం పిచ్ రిపోర్ట్ ప్రకారం.. ఇది సాంప్రదాయకంగా బ్యాటింగ్‌కు స్వర్గధామం. ఇక్కడ జరిగిన గత మ్యాచ్‌లోనే ఇరు జట్లు కలిసి ఏకంగా 414 పరుగులు సాధించాయి. టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకోవడానికి ప్రధాన కారణం.. రాత్రి వేళల్లో వచ్చే మంచు ప్రభావమే. అయితే, ఇక్కడి పిచ్‌పై పేస్ బౌలర్లకు ఆరంభంలో మంచి స్వింగ్ లభిస్తుంది. అలాగే స్లో బాల్స్ వేసే బౌలర్ల బౌలింగ్‌లో పరుగులు చేయడం బ్యాటర్లకు కాస్త కష్టంగా మారుతుంది. ఏదేమైనా టాస్ గెలిచి చేజింగ్ ఎంచుకున్న చెన్నైకి పిచ్ కండిషన్స్ కొంతవరకు అనుకూలించే అవకాశం ఉంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్ CINEMA
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com